జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :13 సంచిక :81 మంగళవారం | 24-11-2026 పేజీలు:8 వెల:రు 3 https://www.epaperjournalistdiary.com/


ఆసియా శక్తిమంత దేశాల్లో
భారత్‌కు మూడో స్థానం!

- ఆసియా పవర్ ఇండెక్స్--2026 నివేదికలో వెల్లడి
- అత్యంత శక్తిమంతమైన నేతల్లో మోదీకి రెండో ర్యాంకు
- తొలి స్థానంలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్
- 40.5 పాయింట్లకు పెరిగిన భారత్ స్కోరు
- 2018 తర్వాత చైనాతో అత్యల్ప స్థాయికి చేరిన శక్తి అంతరం
- ఎనిమిది విభాగాల్లో ఐదింటిలో భారత్ పురోగతి
- రక్షణ నెట్‌వర్క్ విభాగంలో భారత్‌కు తొమ్మిదో స్థానం
- బ్రహ్మోస్ క్షిపణుల విక్రయాలతో పెరిగిన రక్షణ సంబంధాలు



ప్రతిసారీ లాగౌట్ అవ్వండి..

- వాట్సాప్ వెబ్ యూజర్లకు కేంద్ర హోం శాఖ హెచ్చరిక
- లాగౌట్ చేయకుంటే ఖాతా దుర్వినియోగమయ్యే ప్రమాదం
- ట్యాబ్ మూసినా ముగియని వాట్సాప్ వెబ్ సెషన్
- పబ్లిక్ కంప్యూటర్లలో వినియోగించవద్దని సూచన
- వ్యక్తిగత సంభాషణలు ఇతరుల చేతుల్లోకి వెళ్లే ముప్పు
- ఖాతా ద్వారా మోసపూరిత సందేశాలు పంపే అవకాశం
- ఫిషింగ్, ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- పని పూర్తయ్యాక తప్పనిసరిగా లాగౌట్ చేయాలి



కృష్ణా జలాల్లో చుక్క నీటిని
వదులుకోం!

తెలంగాణ వాటా సాధించడంలో ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉంది



- 575 టీఎంసీల హక్కుల కోసం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే పోరాటం
- కేంద్రం, కృష్ణా బోర్డు, సుప్రీంకోర్టులో న్యాయపోరాటం
- ఆరు నుంచి ఎనిమిది నెలల్లో బ్రిజేష్ ట్రిబ్యునల్ తీర్పునకు ప్రయత్నాలు
- పల్నాడు వాటర్ గ్రిడ్‌కు గత ప్రభుత్వమే అవకాశం కల్పించింది
- 2022 ఫిబ్రవరి 16న జీవో 56 జారీ
- 2015లో 299 టీఎంసీలకు అంగీకరించడం తెలంగాణకు నష్టం
- పోతిరెడ్డిపాడు సామర్థ్యం 11 వేల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంపు
- గత పదేళ్లలో తెలంగాణ ప్రాజెక్టులు పూర్తి చేయలేదని విమర్శ
- నీటి హక్కులపై తప్పుడు ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్:

కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన వాటా సాధించే విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని, ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని తేల్చిచెప్పారు. కృష్ణా, గోదావరి జలాలపై వస్తున్న వార్తలు, పల్నాడు వాటర్ గ్రిడ్ అంశంపై వాస్తవాలను వివరించేందుకు ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన

-మిగతా 2 లో




గెలిచే మ్యాచ్ డ్రా..

- భారత్ దెబ్బకు తారుమారైన డబ్ల్యూటీసీ ర్యాంకులు
- న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టును డ్రా చేసుకున్న భారత్
- ఆఖరి రోజు కివీస్ బ్యాటర్ల వీరోచిత పోరాటం
- డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి పడిపోయిన న్యూజిలాండ్
- రెండో స్థానానికి ఎగబాకిన ఆస్ట్రేలియా.. నాలుగో స్థానంలోనే భారత్
- అగ్రస్థానంలో కొనసాగుతున్న దక్షిణాఫ్రికా



కేంద్ర బలగాల వాట్సాప్ గ్రూపుల్లో
పాక్ గూఢచారులు!

- 13 నుంచి 14 ప్రైవేటు గ్రూపుల్లోకి చొరబాటు అనుమానాలు
- భారత మొబైల్ నంబర్లను అనుకరించి ప్రవేశించినట్లు గుర్తింపు
- నిఘా వర్గాల అప్రమత్తతతో భద్రతా సంస్థల్లో కలకలం
- సోషల్ మీడియా ఖాతాలపై సమగ్ర తనిఖీలకు ఆదేశాలు
- గుర్తుతెలియని వ్యక్తులను వెంటనే తొలగించాలని సూచన



తెలంగాణకు బీజేపీ
చేసిందేమిటి?

- ఆర్ఆర్ఆర్‌ను కేంద్ర కేబినెట్‌లో ఎందుకు పెట్టలేదు?
- కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలి
- కేంద్ర ప్రభుత్వంపై మంత్రి కోమటిరెడ్డి విమర్శలు
- ప్రాజెక్టు జాప్యంపై బీజేపీ నేతలు వివరణ ఇవ్వాలి
- తెలంగాణకు న్యాయం చేయడంలో కేంద్రం విఫలమైందని ఆరోపణ
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 90 సీట్లు వస్తాయని ధీమా
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

హైదరాబాద్,

: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఏం చేసిందో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ముఖ్యంగా ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ ముందుకు తీసుకెళ్లకుండా ఎందుకు పెండింగ్‌లో పెట్టారో వివరించాలని కోరారు. తెలంగాణకు న్యాయం చేయకుండా బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఏ ముఖం పెట్టుకొని రాష్ట్రానికి వస్తున్నారని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో మీడియాతో మంత్రి మాట్లాడారు.

-మిగతా 2 లో



కాంగ్రెస్‌కు 90 సీట్లు
ఎలా వస్తాయి?

- రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ సూటి ప్రశ్న
- హామీల అమలుపై ముఖ్యమంత్రిని నిలదీత
- నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్న
- మహిళలకు నెలకు రూ.2,500 హామీ ఎక్కడ?
- ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేశారా?
- బీజేపీ అధికారంలోకి వస్తుందని సంజయ్ ధీమా
- ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ తీరును విమర్శించిన కేంద్ర మంత్రి
- మరణించిన వారి ఓట్లు తొలగిస్తే తప్పేంటని ప్రశ్న
- దేశద్రోహుల ఓట్ల తొలగింపునూ తప్పబడతారా?

కరీంనగర్:

తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 90 స్థానాలు ఎలా వస్తాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీల్లో ఏవైనా సమర్థంగా అమలు చేశారా? అని నిలదీశారు. కరీంనగర్‌లో పర్యటించిన ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పకుండా కాంగ్రెస్ 90 స్థానాలు సాధిస్తుందని ముఖ్యమంత్రి ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను బండి సంజయ్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. అర్హులైన మహిళలకు నెలకు రూ.2,500 చెల్లిస్తామన్న హామీ

-మిగతా 2 లో

- రూ.15,000 కోట్ల అభివృద్ధి ప్యాకేజీ
- నేపాల్ అభివృద్ధికి రూ.15,000 కోట్ల భారీ ప్యాకేజీ ప్రకటించిన భారత్
- ప్రధాని మోదీ, నేపాల్ ప్రధాని బాలేన్ షా మధ్య ఫలవంతమైన చర్చలు
- రెండు దేశాల మధ్య 8 కీలక అవగాహన ఒప్పందాలపై సంతకాలు
- కష్టకాలంలో భారత్ అండగా నిలుస్తుందని నేపాల్ ప్రధాని ప్రశంస
- రోడ్, రైల్, సరిహద్దు కనెక్టివిటీ పెంచాలని ఇరు దేశాల నిర్ణయం




నేపాల్‌కు భారత్ భారీ కానుక..

తెలంగాణకు ద్రోహం చేసింది
కాంగ్రెస్సే

బీఆర్ఎస్ పాలనలోనే అత్యధికంగా కృష్ణా జలాల వినియోగం!

- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు పచ్చి అబద్ధాలు
- ముఖ్యమంత్రి అతితెలివితేటలు ప్రదర్శించారు
- 2016--17లో 45.5 శాతం నీటి వినియోగం
- 2024--25లో 28 శాతమే వినియోగం
- 2025--26లో కేవలం 25 శాతం నీటి వినియోగం
- 132 టీఎంసీల వినియోగంపై హరీశ్‌రావు అభ్యంతరం
- నాగార్జునసాగర్ ఆయకట్టుకు క్రాప్ హాలిడే ఎందుకిచ్చారు?
- మంగళవారం ఆధారాలతో వాస్తవాలు వెల్లడిస్తానని ప్రకటన

ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం



హైదరాబాద్,

బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ అత్యధికంగా కృష్ణా జలాలను వినియోగించుకుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు స్పష్టం చేశారు. నాడైనా, నేడైనా తెలంగాణకు ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో అతితెలివితేటలు ప్రదర్శించి పచ్చి అబద్ధాలు చెప్పారని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. సోమవారం రాత్రి ఓ వార్తా ఛానల్ చర్చలో పాల్గొన్న ఆయన ముఖ్యమంత్రి చేసిన

-మిగతా 2 లో



న్యాయాధికారాల్లో బాహుబలిలా
వ్యవహరించొద్దు!

- బీహార్ న్యాయమూర్తిపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- ఎస్పీని అదే రోజు దోషిగా ప్రకటించడంపై అభ్యంతరం
- రూ.1 జరిమానా విధించిన జిల్లా అదనపు సెషన్స్ జడ్జి
- ఎస్పీ సర్వీస్ రికార్డుల్లో నమోదు చేయాలని డీజీపీకి ఆదేశం
- న్యాయమూర్తి ఉత్తర్వులను నిలిపివేసిన పాట్నా హైకోర్టు
- న్యాయాధికారాల వినియోగంలో సంయమనం పాటించాలని సీజేఐ హితవు

కృష్ణా జలాల్లో చుక్క నీటిని వదులుకోం!

మొదటి తరువాయి

మాట్లాడారు. బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయించిందని సీఎం గుర్తుచేశారు. రాష్ట్ర విభజన తర్వాత 71 శాతం కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో ఉన్నందున 575 టీఎంసీల వాటా రావాల్సి ఉందని తెలిపారు. ఈ హక్కుల సాధన కోసం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ప్రధానమంత్రి వద్ద పలుమార్లు విజ్ఞప్తులు చేశామని చెప్పారు. న్యాయమైన వాటా కోసం సుప్రీంకోర్టులోనూ పోరాటం చేస్తున్నట్లు వెల్లడించారు. అంతర్రాష్ట్ర జల వివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి మంత్రికి ఇప్పటికే నివేదించామని, ప్రధానమంత్రిని కూడా పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. జలరంగ నిపుణులు, న్యాయవాదుల సలహాలతో నిర్దిష్ట విధానంలో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు ఆరు నుంచి ఎనిమిది నెలల్లో వెలువడేలా నిరంతరం సమీక్షిస్తూ ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. పల్నాడు వాటర్ గ్రిడ్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలించేందుకు తమ ప్రభుత్వం అవకాశం కల్పించిందన్న ఆరోపణలను సీఎం ఖండించారు. 2022 ఫిబ్రవరి 16న గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 56తోనే ఈ ప్రాజెక్టుకు అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా కింద 13 జిల్లాలకు తాగునీరు అందించే పథకంలో భాగంగా రూ.1,200 కోట్లతో గుంటూరు జిల్లా పల్నాడుకు నీటిని తరలించే అంశం ఉందని తెలిపారు. దీనికి జల్‌జీవన్ మిషన్ కింద కేంద్రం నుంచి రూ.500 కోట్ల మ్యాచింగ్ గ్రాంటు పొందేలా అప్పటి ప్రభుత్వం అంగీకరించిందని చెప్పారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే కృష్ణా బోర్డు, కేంద్రానికి ఫిర్యాదు చేశామని వెల్లడించారు. 2015లో అప్పటి కేంద్ర జలశక్తి మంత్రి ఉమాభారతి నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అంగీకరించారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణకు 575 టీఎంసీలు దక్కాల్సి ఉండగా 299 టీఎంసీలకు అంగీకరించడం రాష్ట్ర నీటి హక్కులకు నష్టం కలిగించిందని విమర్శించారు. 2020లో కృష్ణా బోర్డు సమావేశంలోనూ ఆంధ్రప్రదేశ్‌కు 66 శాతం, తెలంగాణకు 34 శాతం నీటి వాటా కొనసాగించేందుకు అంగీకరించడం సరికాదన్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా గతంలో రోజుకు 11 వేల క్యూసెక్కుల నీటిని తరలించేందుకు అవకాశం ఉండగా, గత ప్రభుత్వ హయాంలో దాని సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు పెంచేందుకు అనుమతులు ఇచ్చారని సీఎం ఆరోపించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి అనుమతులు ఇచ్చినప్పటికీ తెలంగాణ ప్రాజెక్టులపై తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించారు. హంద్రీనీవా సుజల స్రవంతి మొదటి దశ ద్వారా 40 టీఎంసీల నీటిని తరలించేందుకు 2004లో జీవో 73 జారీ చేసిన సమయంలోనూ తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల్లో ఏ ఒక్కటీ పూర్తికాలేదని ముఖ్యమంత్రి అన్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో పోతిరెడ్డిపాడు, జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్, రాజోలిబండ వంటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసుకున్నారని చెప్పారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కాకముందు ఆంధ్రప్రదేశ్ రోజుకు 4.47 టీఎంసీల నీటిని తరలించుకునే అవకాశం ఉండగా, ఆ తర్వాత కొత్త ప్రాజెక్టుల ద్వారా రోజుకు 13.17 టీఎంసీల వరకు తరలించుకునే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. రాయలసీమలో ఎనిమిది ప్రాజెక్టులు నిర్మించినా తెలంగాణలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదని విమర్శించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, పరిహారం చెల్లింపుల్లో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని సీఎం ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక అధికారిని నియమించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేశామని తెలిపారు. కృష్ణా బేసిన్‌లో గత పదేళ్లలో అదనంగా రూ.10 వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే పలు ప్రాజెక్టులు పూర్తయ్యేవని అభిప్రాయపడ్డారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్ది తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాను సాధించడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. రాష్ట్రానికి నీటిని తరలించుకుపోతున్నారంటూ ప్రజల్లో అనవసర అపోహలు సృష్టించవద్దని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. రాజకీయ ఆరోపణలు, ప్రచారాలను నమ్మకుండా వాస్తవాలు, ఆధారాలను పరిశీలించాలని కోరారు. తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణకు రాజకీయంగా, న్యాయపరంగా నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కేంద్ర బలగాల వాట్సాప్ గ్రూపుల్లో పాక్ గూఢచారులు!

న్యూఢిల్లీ



కేంద్ర సాయుధ బలగాలు, రక్షణ శాఖ అధికారులు వినియోగించే ప్రైవేటు వాట్సాప్ గ్రూపుల్లోకి పాకిస్థాన్ గూఢచారులు చొరబడినట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. భారత మొబైల్ నంబర్లను అనుకరించి 13 నుంచి 14 గ్రూపుల్లోకి ప్రవేశించినట్లు అనుమానిస్తున్నాయి. ఈ పరిణామంతో భద్రతా వర్గాలు అప్రమత్తమయ్యాయి. బలగాల సిబ్బంది వినియోగిస్తున్న సామాజిక మాధ్యమాల ఖాతాలపై తక్షణమే సమగ్ర తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. సంబంధిత వాట్సాప్ గ్రూపుల్లో జరిగే చర్చలు, సమాచార మార్పిడి, పత్రాలను పాకిస్థాన్ గూఢచారులు నిశ్శబ్దంగా పరిశీలిస్తున్నట్లు నిఘా సంస్థలు అనుమానిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గుర్తింపు నిర్ధారణ కాని వ్యక్తులను గ్రూపుల నుంచి వెంటనే తొలగించాలని సిబ్బందికి సూచించాయి. అధికారిక, రహస్య సమాచారాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని స్పష్టం చేశాయి. ఇప్పటికే ఒక వాట్సాప్ గ్రూపులో డీఆర్డీవో శాస్త్రవేత్తనని చెప్పుకుంటూ 'సోనియా' అనే పేరుతో చలామణి అవుతున్న వ్యక్తికి కొందరు కీలక సమాచారాన్ని అందించినట్లు నిఘా వర్గాలు గుర్తించాయని సమాచారం. ఈ ఘటన నేపథ్యంలో గ్రూపుల్లోని సభ్యుల వివరాలు, వారి గుర్తింపు, సమాచార మార్పిడి తీరును క్షుణ్ణంగా పరిశీలించాలని భద్రతా సంస్థలు సూచించాయి. సున్నితమైన రక్షణ సమాచారాన్ని అనధికార వ్యక్తులకు చేరకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించాయి.

గెలిచే మ్యాచ్ డ్రా..

న్యూఢిల్లీ



వెల్లింగ్‌టన్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో భారత్‌కు విజయం చేజారింది. గెలుపు ఖాయమనుకున్న మ్యాచ్ చివరికి డ్రాగా ముగిసింది. ఇన్నింగ్స్ విజయానికి ఆఖరి రోజు 8 వికెట్లు అవసరం కాగా, భారత బౌలర్లు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఈ డ్రా ఫలితం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025-27 పాయింట్ల పట్టికలో భారీ మార్పులకు కారణమైంది.నేడు ఆఖరి రోజు ఆటలో, టీమిండియా బౌలర్లు ఆరంభంలో రాణించారు. న్యూజిలాండ్‌ను 139 పరుగులకే 5 వికెట్లు పడగొట్టి విజయంపై ఆశలు రేపారు. అయితే, ఆ తర్వాత క్రీజులో పాతుకుపోయిన డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ అద్భుత ప్రతిఘటన కనబరిచారు. బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై కివీస్ బ్యాటర్లు ఓటమిని తప్పించుకుని మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. ఈ డ్రా కారణంగా న్యూజిలాండ్ డబ్ల్యూటీసీ పట్టికలో టాప్-2 నుంచి కిందకు పడిపోయింది. వారి 'పర్సంటేజ్ ఆఫ్ పాయింట్స్' (పీసీటీ) 72.22 నుంచి 66.67కి తగ్గడంతో మూడో స్థానానికి పరిమితమైంది. దీంతో, వారి చిరకాల ప్రత్యర్థి ఆస్ట్రేలియా 69.23 పీసీటీతో రెండో స్థానానికి ఎగబాకింది. దక్షిణాఫ్రికా 75.00 పీసీటీతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇక భారత్ విషయానికొస్తే, జట్టు పీసీటీ 51.52 నుంచి 50.00కి స్వల్పంగా తగ్గినా, నాలుగో స్థానంలోనే యథాతథంగా ఉంది. తర్వాతి స్థానాల్లో బంగ్లాదేశ్, ఇంగ్లండ్, వెస్టిండీస్, శ్రీలంక, పాకిస్థాన్ ఉన్నాయి.

ఆసియా శక్తిమంత దేశాల్లో భారత్‌కు మూడో స్థానం!

- ఆసియా పవర్ ఇండెక్స్--2026 నివేదికలో వెల్లడి
- అత్యంత శక్తిమంతమైన నేతల్లో మోదీకి రెండో ర్యాంకు
- తొలి స్థానంలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్
- 40.5 పాయింట్లకు పెరిగిన భారత్ స్కోరు
- 2018 తర్వాత చైనాతో అత్యల్ప స్థాయికి చేరిన శక్తి అంతరం
- ఎనిమిది విభాగాల్లో ఐదింటిలో భారత్ పురోగతి
- రక్షణ నెట్‌వర్క్ విభాగంలో భారత్‌కు తొమ్మిదో స్థానం
- బ్రహ్మోస్ క్షిపణుల విక్రయాలతో పెరిగిన రక్షణ సంబంధాలు
- సాంస్కృతిక ప్రభావంలో 43.8 పాయింట్ల స్కోరు




న్యూఢిల్లీ

ఆసియా ఖండంలో భారత్ తన ప్రాబల్యాన్ని మరింత విస్తరిస్తోంది. ఆసియాలో మూడో అత్యంత శక్తిమంతమైన దేశంగా తన స్థానాన్ని పటిష్ఠం చేసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం, ఆర్థిక అంచనాలు, వ్యూహాత్మక దౌత్య సంబంధాలు దేశ ప్రాభవాన్ని పెంచుతున్నాయని ప్రముఖ అంతర్జాతీయ పరిశోధనా సంస్థ లోవీ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసిన ఆసియా పవర్ ఇండెక్స్--2026 నివేదిక వెల్లడించింది. ఆసియాలో అత్యంత ప్రభావవంతమైన ప్రాంతీయ నేతల్లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తర్వాత మోదీ రెండో స్థానంలో నిలిచినట్లు పేర్కొంది. లోవీ ఇన్‌స్టిట్యూట్ ప్రాజెక్టు అధిపతి డాక్టర్ హంటర్ మార్స్‌టన్ వివరాల ప్రకారం.. భారత్ తన స్కోరును 40.5 పాయింట్లకు పెంచుకుని ప్రధాన శక్తిగా స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. 2018లో ఈ సూచీ ప్రారంభమైనప్పటి నుంచి చైనాతో ఉన్న శక్తి అంతరాన్ని భారత్ అత్యల్ప స్థాయికి తగ్గించగలిగింది. అయినప్పటికీ చైనా మొత్తం శక్తి భారత్ కంటే 80 శాతం అధికంగా ఉన్నట్లు నివేదిక అంచనా వేసింది. ఎనిమిది కీలక విభాగాల్లో ఐదింటిలో భారత్ పురోగతి సాధించినట్లు వివరించింది. ఆగ్నేయాసియా దేశాలతో రక్షణ సంబంధాలు బలోపేతం కావడం, బ్రహ్మోస్ క్షిపణుల విక్రయాలు భారత రక్షణ నెట్‌వర్క్‌ను విస్తరించాయని నివేదిక పేర్కొంది. ఈ విభాగంలో భారత్ తొమ్మిదో స్థానాన్ని దక్కించుకున్నట్లు తెలిపింది. భారత సాంస్కృతిక ప్రభావం కూడా పెరిగి 43.8 పాయింట్లకు చేరినట్లు వెల్లడించింది. దౌత్య సంబంధాల రంగంలోనూ భారత్ తన ప్రాబల్యాన్ని విస్తరించిందని వివరించింది. అయితే కొన్ని ఆర్థిక, దౌత్యపరమైన అంశాలు భారత్ పురోగతికి సవాళ్లుగా మారాయని నివేదిక అభిప్రాయపడింది. రూపాయి విలువ క్షీణించడం, అంతర్జాతీయ ద్రవ్య నిధి గణాంకాల విధానంలో మార్పులు, విదేశీ పెట్టుబడుల్లో దాదాపు 20 బిలియన్ డాలర్ల తగ్గుదల ప్రతికూల ప్రభావం చూపినట్లు పేర్కొంది. గల్ఫ్ సంక్షోభ సమయంలో భారత్ దౌత్యపరంగా కొంత సంయమనం పాటించడంతో మోదీ వ్యూహాత్మక ఆకాంక్షలపై అంచనాలు తగ్గినట్లు విశ్లేషించింది. మరోవైపు పశ్చిమాసియాపై అమెరికా దృష్టి కేంద్రీకరించడంతో ఆసియాలో చైనా తన పట్టును మరింత పెంచుకుందని నివేదిక తెలిపింది. సైనిక సామర్థ్యం విషయంలో అమెరికా, చైనాల మధ్య అంతరం కూడా తగ్గుతోందని పేర్కొంది. అయినప్పటికీ ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే భారత్‌కు ఎదుగుదలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది.

ప్రతిసారీ లాగౌట్ అవ్వండి..

-వాట్సాప్ వెబ్ యూజర్లకు కేంద్ర హోం శాఖ హెచ్చరిక
- లాగౌట్ చేయకుంటే ఖాతా దుర్వినియోగమయ్యే ప్రమాదం
- ట్యాబ్ మూసినా ముగియని వాట్సాప్ వెబ్ సెషన్
- పబ్లిక్ కంప్యూటర్లలో వినియోగించవద్దని సూచన
- వ్యక్తిగత సంభాషణలు ఇతరుల చేతుల్లోకి వెళ్లే ముప్పు
- ఖాతా ద్వారా మోసపూరిత సందేశాలు పంపే అవకాశం
- ఫిషింగ్, ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- పని పూర్తయ్యాక తప్పనిసరిగా లాగౌట్ చేయాలి



న్యూఢిల్లీ:

కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లలో వాట్సాప్ వెబ్ వినియోగించే వారు ప్రతి సారీ పని పూర్తయ్యాక తప్పనిసరిగా లాగౌట్ కావాలని కేంద్ర హోంశాఖ హెచ్చరించింది. కంప్యూటర్లలో వాట్సాప్ వెబ్‌ను లాగిన్ చేసి అలాగే వదిలేయడం వల్ల వ్యక్తిగత ఖాతాలు సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది. ముఖ్యంగా కార్యాలయాలు, ఇతరులు ఉపయోగించే ఉమ్మడి కంప్యూటర్లలో వాట్సాప్ వెబ్ సెషన్లు కొనసాగడం మోసాలకు అవకాశమిస్తుందని అప్రమత్తం చేసింది. కేంద్ర హోంశాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ)కు చెందిన నేషనల్ సైబర్ క్రైమ్ థ్రెట్ అనలిటిక్స్ యూనిట్ ఈ భద్రతా హెచ్చరికను జారీ చేసింది. చాలామంది పని పూర్తయిన తర్వాత బ్రౌజర్ ట్యాబ్‌ను మాత్రమే మూసివేస్తుంటారని, అయితే అలా చేసినంత మాత్రాన వాట్సాప్ వెబ్ నుంచి ఖాతా నిష్క్రమించదని అధికారులు వివరించారు. అదే కంప్యూటర్‌ను ఉపయోగించే మరో వ్యక్తి వ్యక్తిగత సంభాషణలు చదవడం, పరిచయాల వివరాలు, గ్రూపు చాట్‌లను పరిశీలించడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు బాధితుల ఖాతాల నుంచి ఇతరులకు సందేశాలు పంపడం, నకిలీ లింకుల ద్వారా సమాచారాన్ని సేకరించడం, ఆర్థిక మోసాలకు పాల్పడటం వంటి చర్యలకు దిగవచ్చని హెచ్చరించారు. అందువల్ల కార్యాలయ కంప్యూటర్లు, సైబర్ కేంద్రాలు, హోటళ్లలోని ఉమ్మడి కంప్యూటర్లలో వాట్సాప్ వెబ్ వినియోగించకపోవడమే మంచిదని సూచించారు. కంప్యూటర్‌లో పని పూర్తయిన ప్రతిసారీ వాట్సాప్ మెనూలోకి వెళ్లి లాగౌట్ చేయాలని అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో నమ్మకమైన కంప్యూటర్లలో మాత్రమే అజ్ఞాత లేదా వ్యక్తిగత బ్రౌజింగ్ విధానాన్ని ఉపయోగించాలని, అయితే అది పూర్తిస్థాయి భద్రతకు హామీ కాదని స్పష్టం చేశారు. కంప్యూటర్ నిర్వహణ వ్యవస్థ, బ్రౌజర్, వైరస్ నిరోధక సాఫ్ట్‌వేర్‌లను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని తెలిపారు. గుర్తుతెలియని లింకులను తెరవడం, అనుమానాస్పద సాఫ్ట్‌వేర్‌లను దిగుమతి చేసుకోవడం మానుకోవాలని సూచించారు. తాము పంపని సందేశాలు ఖాతాలో కనిపించినా, పరిచయస్తుల నుంచి వింత స్పందనలు వచ్చినా వెంటనే ఖాతా భద్రతను పరిశీలించుకోవాలని పేర్కొన్నారు. ఆర్థిక, వ్యక్తిగత రహస్య సమాచారాన్ని వాట్సాప్‌లో పంచుకునే విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సున్నితమైన సమాచారాన్ని నిర్వహించే ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు తమ కంప్యూటర్లలో వాట్సాప్ వెబ్ వినియోగంపై తగిన నియంత్రణలు పాటించాలని సైబర్ భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నేపాల్‌కు భారత్ భారీ కానుక..

న్యూఢిల్లీ

భారత్, నేపాల్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు మరింత బలపడ్డాయి. నేపాల్ అభివృద్ధికి, పునర్నిర్మాణానికి మద్దతుగా నిలుస్తూ భారత ప్రభుత్వం భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. నేపాల్ ప్రధాని బాలేన్ షాతో న్యూఢిల్లీలో జరిగిన ద్వైపాక్షిక సమావేశం అనంతరం, ప్రధాని నరేంద్ర మోదీ రూ.24,000 కోట్ల నేపాలీ రూపాయల (సుమారు రూ.15,000 కోట్లు) అభివృద్ధి ప్యాకేజీని అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం ఇరు దేశాల మధ్య సహకారానికి కొత్త అధ్యాయాన్ని లిఖించింది. నేపాల్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక బాలేన్ షా భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "భారత్, నేపాల్ కేవలం పొరుగు దేశాలు మాత్రమే కాదు. మన బంధం విశ్వాసం, స్నేహంతో ముడిపడి ఉంది. కష్టసుఖాల్లో ఒకరికొకరం అండగా నిలుస్తాం" అని అన్నారు. నేపాల్ యువత ఆశలు, ఆకాంక్షలకు బాలేన్ షా నాయకత్వం నిదర్శనమని, ఆయన దార్శనికతను ప్రశంసించారు. రెండు దేశాల మధ్య రోడ్, రైల్, సరిహద్దు కనెక్టివిటీని మరింత పెంచాలని నిర్ణయించినట్లు మోదీ తెలిపారు. ఇటీవల నేపాల్‌ను అతలాకుతలం చేసిన వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆయన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా నేపాల్ ప్రధాని బాలేన్ షా మాట్లాడుతూ.. భారత్ అందించిన ఆత్మీయ ఆతిథ్యానికి ధన్యవాదాలు తెలిపారు. "భారత్, నేపాల్ బంధం హిమాలయాలంత దృఢమైనది, సముద్రమంత విశాలమైనది. మన మధ్య ఉన్న సాన్నిహిత్యాన్ని మాటల్లో వర్ణించలేం. కష్టకాలంలో, ప్రకృతి వైపరీత్యాల సమయంలో భారత్ ఎల్లప్పుడూ మాకు అండగా నిలుస్తుంది. అందుకు భారత ప్రభుత్వానికి, ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని అన్నారు. అనంతరం ఆయన ప్రధాని మోదీని నేపాల్ పర్యటనకు రావాల్సిందిగా ఆహ్వానించారు.ఈ సమావేశంలో భాగంగా ఇరు దేశాల మధ్య 8 కీలక అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) జరిగాయి. సివిల్ సర్వీస్ సామర్థ్య శిక్షణ, అంతరిక్ష పరిశోధన, ఆరోగ్యం, వైద్యం, పట్టణాభివృద్ధి, ఆయుర్వేదం, సాంప్రదాయ వైద్యం వంటి రంగాల్లో పరస్పర సహకారం కోసం ఈ ఒప్పందాలు కుదిరాయి. దీంతో పాటు ఇంధనం, కనెక్టివిటీకి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులను ఇరు దేశాల ప్రధానులు సంయుక్తంగా ప్రారంభించారు. కొన్ని కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన కూడా చేశారు. 'నైబర్‌హుడ్ ఫస్ట్' విధానంలో భాగంగా చమురు సరఫరాలో సవాళ్లు ఎదురైనప్పటికీ నేపాల్‌కు ఇంధనం, ఎరువులు, ఇతర నిత్యావసరాలను నిరంతరాయంగా అందించామని మోదీ గుర్తుచేశారు.

న్యాయాధికారాల్లో బాహుబలిలా వ్యవహరించొద్దు!

న్యూఢిల్లీ, నవంబర్ 23

: న్యాయాధికారాలను వినియోగించుకునేటప్పుడు బాహుబలిలా వ్యవహరించవద్దని బీహార్ న్యాయమూర్తి అనిల్ కుమార్‌ను సుప్రీంకోర్టు ఘాటుగా మందలించింది. పోలీసు అధికారి తన ఆదేశాలను అమలు చేయలేదన్న కారణంతో అదే రోజు దోషిగా ప్రకటించి జరిమానా విధించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. న్యాయాధికారాల వినియోగంలో సంయమనం పాటించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం హితవు పలికింది.రోహ్‌తాస్ జిల్లా అదనపు సెషన్స్ జడ్జిగా పనిచేస్తున్న అనిల్ కుమార్ సెప్టెంబర్ 29న అప్పటి ఎస్పీ రౌషన్ కుమార్‌కు రూ.1 జరిమానా విధించారు. 2023లో ముగిసిన ఓ క్రిమినల్ కేసులో తప్పుడు సాక్ష్యం ఇచ్చిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. అయితే ఆ ఆదేశాలను ఎస్పీ అమలు చేయలేదని భావించిన జడ్జి ఆయనను కోర్టుకు పిలిపించి, ఉద్దేశపూర్వకంగా ధిక్కరించారని పేర్కొంటూ అదే రోజు దోషిగా నిర్ధారించారు.

తెలంగాణకు బీజేపీ చేసిందేమిటి?

మొదటి తరువాయి

ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు విషయంలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు తాను ప్రయత్నించానని కోమటిరెడ్డి తెలిపారు. అయినప్పటికీ ఈ ప్రతిపాదనను కేంద్ర కేబినెట్‌లో ప్రవేశపెట్టకుండా పెండింగ్‌లో ఉంచారని ఆరోపించారు. ప్రాజెక్టు విషయంలో జరుగుతున్న జాప్యానికి కారణాలను బీజేపీ నేతలు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 90 స్థానాలు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తన ప్రణాళిక ప్రకారం పార్టీ ముందుకు సాగితే వందకుపైగా స్థానాల్లో విజయం సాధిస్తుందని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన పదవులు కల్పించాల్సిన అవసరం ఉందని కోమటిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని పార్టీ నూతన ఇన్‌ఛార్జితో చర్చిస్తానని తెలిపారు. ఓటు చోరీ జరుగుతోందని ఉత్తరప్రదేశ్ బీజేపీ ముఖ్యమంత్రే వ్యాఖ్యానించారని ఆయన ప్రస్తావించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేసిన పనులు, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు పురోగతిపై ఆ పార్టీ నాయకులు స్పష్టత ఇవ్వాలని మంత్రి కోరారు.

కాంగ్రెస్‌కు 90 సీట్లు ఎలా వస్తాయి?

మొదటి తరువాయి

ఏమైందని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ హామీలను నెరవేర్చిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బీజేపీకి అధికారం అప్పగించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపైనా బండి సంజయ్ స్పందించారు. ఈ ప్రక్రియపై కాంగ్రెస్ నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. మరణించిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తే తప్పేమిటని ప్రశ్నించారు. దేశద్రోహుల ఓట్లను తొలగించడం కూడా తప్పేనని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారా? అని వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి ఎవరు కావాలనేది నిర్ణయించే అధికారం ప్రజలకే ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రాజకీయ సమరం ప్రారంభమైందని, తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని బండి సంజయ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

తెలంగాణకు ద్రోహం చేసింది కాంగ్రెస్సే

మొదటి తరువాయి

ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు. 2016--17లో కృష్ణా జలాల్లో అత్యధికంగా 45.5 శాతం నీటిని వినియోగించుకున్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆ తర్వాత నీటి వినియోగం తగ్గిందని వివరించారు. 2024--25లో 28 శాతం, 2025--26లో కేవలం 25 శాతం నీటినే వినియోగించుకున్నామని తెలిపారు. అయితే 132 టీఎంసీల నీటిని వినియోగించుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పడం వాస్తవాలకు దూరమని కొట్టిపారేశారు. ముఖ్యమంత్రి చెబుతున్నట్లుగా 132 టీఎంసీల నీటిని వినియోగించుకుంటే అంతమేర పంటలు ఎందుకు సాగు కాలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. నాగార్జునసాగర్ కింద ఆయకట్టుకు పంట విరామం ఎందుకు ప్రకటించాల్సి వచ్చిందని నిలదీశారు. రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలకు సమాధానంగా మంగళవారం అన్ని వివరాలు, ఆధారాలను ప్రజల ముందు ఉంచుతానని ప్రకటించారు. ముఖ్యమంత్రి నిజస్వరూపాన్ని ఆధారాలతో బహిర్గతం చేస్తానని హరీశ్‌రావు పేర్కొన్నారు.

-మిగ

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

కబ్జాదారులకు అధికారుల అండ..
ప్రజావాణి ఫిర్యాదులకే దిక్కులేదా

గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోని మున్సిపల్ టీపీఓ పావని

రెండోసారి ప్రజావాణిలో ఎంపీడీవో శ్రీకాంత్‌కు ఆర్ఎన్ రాము ఫిర్యాదు

ప్రధాన కూడళ్లు, కాలనీ రోడ్ల కబ్జాలపై తక్షణమే కొరడా ఝుళిపించాలని డిమాండ్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యలు పేరుకుపోతుంటే, అక్రమ నిర్మాణాలు, రోడ్ల కబ్జాలను అరికట్టాల్సిన అధికారులు కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని నాలుగు ప్రధాన సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సామాజిక కార్యకర్త ఆర్ఎన్ రాము, ఎంపీడీవో శ్రీకాంత్‌కు మరోసారి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గత నవంబర్ 2న ఇవే సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, ఆ దరఖాస్తును మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీఓ) పావనికి బదిలీ చేశారని, అయితే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని రాము తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

చౌరస్తాలో అంధకారంనడిరోడ్డుపై జియో స్తంభాలప్రమాదం.

పట్టణానికి గుండెకాయ లాంటి ప్రధాన చౌరస్తాలో నాలుగు వైపులా వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రహదారికి అడ్డుగా ఉన్న జియో ఫైబర్ స్తంభాలు నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. తక్షణమే స్తంభాలను తొలగించి, చౌరస్తాలో నాలుగు వైపులా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా 'ఫ్రీ లెఫ్ట్' ఆక్రమణ

షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాల రద్దీని తగ్గించేందుకు ఏర్పాటు చేసిన 'ఫ్రీ లెఫ్ట్' మార్గాన్ని ఆక్రమిస్తూ ఓ భవన యజమాని బాల్కనీ నిర్మించారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న ఈ అక్రమ నిర్మాణంపై టౌన్ ప్లానింగ్ అధికారులు కళ్లుమూసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తక్షణమే సర్వే చేసి ఆ బాల్కనీని కూల్చివేయాలని కోరారు.

27వ వార్డులో 33 ఫీట్ల రోడ్డు మాయం

పట్టణంలోని 27వ వార్డు, లేఅవుట్ నంబర్ 158/91 పరిధిలో ప్రజల రాకపోకల కోసం కేటాయించిన 33 ఫీట్ల వెడల్పు గల రోడ్డును కొందరు అక్రమార్కులు దర్జాగా కబ్జా చేశారు. భవిష్యత్తులో కాలనీవాసులకు దారి లేకుండా చేస్తున్న ఈ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే హద్దులు గుర్తించి ఆక్రమణలను నేలమట్టం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పాలమూరు రోడ్డులో ఆర్&బీ, మున్సిపల్ స్థలాల కబ్జా.

పాలమూరు రోడ్డులోని భారత్ పెట్రోల్ బంక్ యజమానులు ఆర్&బీ మరియు మున్సిపాలిటీకి చెందిన విలువైన రోడ్డు స్థలం ఆక్రమణకు గురైంది. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ, మున్సిపల్, ఆర్&బీ శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, కబ్జా చెరలో ఉన్న రోడ్డును విడిపించాలని విజ్ఞప్తి చేశారు.

?అధికారుల నిర్లక్ష్యం వీడకపోతే ఆందోళన తప్పదు:

ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులనే బుట్టదాఖలు చేస్తే ఇక సామాన్యులకు న్యాయం ఎక్కడ జరుగుతుందని ఆర్ఎన్ రాము ప్రశ్నించారు. మున్సిపల్, ఆర్&బీ, రెవెన్యూ శాఖల అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

చేగూరులో ఇందిరమ్మ కుటుంబ
జీవిత బీమా నమోదు ప్రారంభం

- అర్హులైన ప్రతి కుటుంబం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ మంకాల శ్రీశైలం



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియ నందిగామ మండలం చేగూరు గ్రామంలో ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ మంకాల శ్రీశైలం ఆధ్వర్యంలో గ్రామస్తులు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది సమక్షంలో పథకం వివరాలను ప్రజలకు తెలియజేస్తూ అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంకాల శ్రీశైలం మాట్లాడుతూ.. కుటుంబ పోషకుడిని కోల్పోయిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. అర్హులైన వ్యక్తి మరణిస్తే వారి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా ఆర్థిక సహాయం అందుతుందని పేర్కొన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన కుటుంబ పోషకులు ఈ పథకానికి అర్హులని, నమోదు కోసం ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నంబర్ అవసరమని వివరించారు. నవంబర్ 19 నుంచి ప్రారంభమైన నమోదు ప్రక్రియ డిసెంబర్ 18 వరకు కొనసాగుతుందని తెలిపారు.

గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఆలస్యం చేయకుండా తమ వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మంకాల శ్రీశైలం కోరారు. మరిన్ని వివరాల కోసం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

షాద్‌నగర్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని
ఆర్డీవో కి వినతిపత్రం అందజేసిన టీఆర్పీ నాయకులు



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :

ఫ్యూచర్ సిటీ పరిధిని షాద్‌నగర్ జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు షాద్‌నగర్ ఆర్డీవో కి వినతిపత్రం సమర్పించడం జరిగింది.

ఈ సందర్భంగా టీఆర్పీ షాద్ నగర్ ఇంచార్జి ఎమ్మె సంతోష్ మాట్లాడుతూ...

గతంలో కూడా షాద్‌నగర్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించామని తెలిపారు. ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఫ్యూచర్ సిటీ పరిధికి షాద్‌నగర్ భౌగోళికంగా, రవాణా పరంగా అనుకూలమైన ప్రాంతమని . మరియు ఫ్యూచర్ సిటీ ప్రాంతంలో అందరికీ అందుబాటులో ఉంటుందని వివరించారు. షాద్‌నగర్‌కు జాతీయ రహదారి, రైల్వే సదుపాయాలు అందుబాటులో ఉండటంతో పాటు, విమానాశ్రయం కూడా సమీపంలో ఉండటం జిల్లా కేంద్రం ఏర్పాటుకు అనుకూలమైన అంశాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో భారీ పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం, పారిశ్రామిక కార్యకలాపాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మెరుగైన పరిపాలనా వ్యవస్థ, పోలీస్, రెవెన్యూ, వైద్య మరియు ఇతర ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. జాతీయ రహదారులపై పెరుగుతున్న ప్రమాదాలు, పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన మోసాలు వంటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా స్థాయి పరిపాలనా వ్యవస్థ ఎంతో అవసరమని వివరించారు. కావున ఫ్యూచర్ సిటీ పరిధికి అందుబాటులో ఉండే విధంగా షాద్‌నగర్‌ను జిల్లా కేంద్రంగా ప్రకటించి, షాద్‌నగర్ జిల్లాను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఆర్డీవో కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మె సంతోష్ టీఆర్పీ షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షులు, ఉప్పరమోని రాములు ముదిరాజ్ టీఆర్పీ షాద్‌నగర్ మున్సిపాలిటీ అధ్యక్షులు, హరి ప్రసాద్, యాదగిరి, గుండ్ల నవీన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా
అయ్యప్ప స్వామి పడి పూజ..



- నాగోలు గ్రామంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, పిల్లాయిపల్లి నర్సింగ్ తదితరులు..

జర్నలిస్టు డైరీ, నాగోలు:

నాగోలు గ్రామంలో అయ్యప్పస్వామి మహాపడిపూజ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో పిల్లయిపల్లి నర్సింగ్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పల్లె మహేష్ గురుస్వామి. పిల్లాయిపల్లి జంగయ్య గురుస్వామి సహకారంతో నిర్వహించిన అయ్యప్ప పడి పూజ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు భజనలు. అయ్యప్ప శ్యాముల శరణుఘోషలతో నాగోలు ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం. అయ్యప్ప నామస్మరణ. భక్తిగీతాలతో ఆ ప్రాంతం మార్మోగింది. పూజ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి స్వామి వారికి ఆశీస్సులు పొందారు. అనంతరం కన్నె స్వామి పిల్లాయిపల్లి నర్సింగ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఘనంగా సన్మానం చేశారు. పిల్లాయిపల్లి ఇందిరమ్మ. శంకరయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ పూజ కార్యక్రమంలో నాగోలు మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్. కొత్తపేట మాజీ కార్పొరేటర్ పవన్ కుమార్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు అనంతుల రాజారెడ్డి, చెర్కు ప్రశాంత్ గౌడ్. పిల్లాయిపల్లి జంగయ్య. డప్పు వినోద్ కుమార్, అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

నిరుపేదల గుడిసెల వదకే
వెళ్లి పల్స్ పోలియో చుక్కలు

చించోడు వైద్య సిబ్బంది సేవలకు అభినందనలు..

65 మంది చిన్నారులకు పోలియో చుక్కలు



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :

షాద్‌నగర్ నియోజకవర్గంలో పల్స్ పోలియో కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతోంది. చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించాలనే లక్ష్యంతో వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించేలా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అయ్యప్ప కాలనీ, సిండికేట్ కాలనీల్లో ఉన్న నిరుపేదల గుడిసెల వద్దకు వైద్య సిబ్బంది మొబైల్ బృందం వెళ్లి పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారి డాక్టర్ అహ్మద్, ఏఎన్ఎం భారతి పాల్గొని మొత్తం 65 మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించారు. సాధారణంగా పోలియో కేంద్రాలకు చేరుకోలేని పేద కుటుంబాలు, వలస కూలీల నివాస ప్రాంతాలు, గుడిసెల్లో నివసించే వారి చిన్నారులను గుర్తించి వైద్య సేవలను వారి వద్దకే తీసుకెళ్లడం విశేషం. ప్రతి చిన్నారికి రెండు చుక్కల పోలియో మందు వేయించడం ద్వారా జీవితాంతం వికలాంగత్వానికి కారణమయ్యే పోలియో ముప్పు నుంచి రక్షణ కల్పించవచ్చని వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి తల్లిదండ్రులు ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వైద్య సిబ్బంది సూచించారు. గతంలో పోలియో చుక్కలు వేసినప్పటికీ జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా మరోసారి చుక్కలు వేయించడం అవసరమని తెలిపారు. మారుమూల ప్రాంతాలు, నిరుపేదల నివాస ప్రాంతాలకు సైతం వెళ్లి వైద్య సేవలు అందిస్తున్న చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొబైల్ బృందం కృషి అభినందనీయంగా నిలుస్తోంది.

రంగారెడ్డి జిల్లా అర్బన్ టీచర్
సెల్ కన్వీనర్‌గా మంగు వెంకన్న నియామకం



జర్నలిస్ట్ డైరీ
హయత్‌నగర్
నవంబర్ 23: -

రంగారెడ్డి జిల్లా అర్బన్ టీచర్ సెల్ నూతన కన్వీనర్‌గా మంగు వెంకన్న నియమితులయ్యారు. జిల్లా అర్బన్ అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి ఈ మేరకు అధికారిక ప్రకటన చేస్తూ మంగు వెంకన్నకు నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ బలోపేతానికి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

ఈ నియామక కార్యక్రమంలో హైకోర్టు కాలనీ డివిజన్ అధ్యక్షులు మర్రి మధుసూదన్ రెడ్డి, హైకోర్టు కాలనీ డివిజన్ జనరల్ సెక్రటరీ సంగీశెట్టి లక్ష్మణ్, రంగారెడ్డి జిల్లా అర్బన్ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పార్వతి, శ్రీనివాస్, డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు రితిక్, డివిజన్ జాయింట్ సెక్రటరీ దీపావళి కిరణ్ కుమార్, అఖిల్, భాను, సాయి తదితర నాయకులు పాల్గొని మంగు వెంకన్నకు శుభాకాంక్షలు తెలిపారు.

పిర్యాదుకు స్పందించి
వేతనం చెల్లించిన సర్పంచ్



నారాయణఖేడ్,నవంబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :

నారాయణఖేడ్ మండలంలోని శేరితాండాకు చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు థాను నాయక్ గ్రామ సర్పంచ్ పై నారాయణఖేడ్ లో సోమవారం జరిగిన ప్రజావాణిలో సబ్ కలెక్టర్ ఎన్.ఉమాహారతికి పిర్యాదు చేశారు.తాను 6 ఏళ్లుగా గ్రామపంచాయతిలో నీటిసరఫరా,రోడ్లు ఊడ్చడం,గ్రామపంచాయతి శుభ్రపరచడం ఇతర పనులు చేస్తున్నానని,తనతో పాటు మరో కార్మికుడు కూడా ఉన్న ఏనాడు పనులు చేయడని,పూర్తి పనులు తానే చేస్తున్నానని, అయినా తనకు వేతనం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తూ,విధుల నుండి తొలగిస్తానని సర్పంచ్ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని పిర్యాదు చేశాడు.పిర్యాదుకు స్పందించిన సబ్ కలెక్టర్ డిఎల్పివో కు పిర్యాదు గురించి తెలుపగ స్పందించిన ఆయన పంచాయతీ కార్యదర్శికి వివరణ అడిగి వెంటనే వేతనం చెల్లించాలని ఆదేశాలు జారీ చేయడంతో,పంచాయతీ కార్యదర్శి కార్మికుడు థాను నాయక్ కు వేతనం అందజేశాడు.సమస్య విన్నవించగానే స్పందించి తనకు వేతనం ఇప్పించిన సబ్ కలెక్టర్ కు థాను నాయక్ కృతజ్ఞతలు తెలియజేశారు.'

సత్యసాయిబాబా బోధనలు
ప్రతి ఒక్కరికీ ఆదర్శం

-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

-షాద్‌నగర్‌లో ఘనంగా శ్రీ సత్యసాయిబాబా 101వ జన్మోత్సవ వేడుకలు

-ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని సత్యదేవ కాలనీలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 101వ జన్మోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమితి నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారి జన్మోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయిబాబా ప్రపంచ మానవాళికి అందించిన సేవ, ప్రేమ, శాంతి సందేశాలు ఎన్నటికీ మరువలేనివని అన్నారు. సత్యసాయిబాబా బోధనలు కేవలం ఆధ్యాత్మికతకే పరిమితం కాకుండా ప్రతి మనిషి జీవన విధానానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.సత్య సాయిబాబా బోధించిన ఐదు విలువలు ప్రతి ఒక్కరూ ఆచరించాలనీ సత్యంతో ఎల్లప్పుడూ నిజాయితీగా జీవించాలి.ధర్మంతో ప్రతి పనిని న్యాయబద్ధంగా, బాధ్యతతో నిర్వహించాలనీ శాంతితో ఎలాంటి పరిస్థితుల్లోనూ మనశ్శాంతిని కోల్పోకూడదనీ ప్రేమతో కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ ప్రేమించాలనీ అహింసతో మాటల్లో, చేతల్లో ఎవరికీ హాని కలిగించకుండా జీవించాలనీ ఈ ఐదు మానవతా విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరిస్తే సమాజంలో ప్రేమ, ఐక్యత, సోదరభావం పెంపొందుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆకాంక్షించారు. సత్య సాయిబాబా చూపిన సేవా మార్గంలో నడుస్తూ పేదలకు, నిరుపేదలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, సామాజికవేత్త కేకే కృష్ణ, మహిళా కౌన్సిలర్ శ్రావణి, బీసీ జనసేన కన్వీనర్ కత్తి చంద్రశేఖర అప్ప, కాంగ్రెస్ నాయకులు చందు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలో పాల్గొన్న
మాజీ ఎమ్మెల్యే





నారాయణఖేడ్,నవంబర్ 23(జర్నలిస్ట్ డైరీ) :

ఖేడ్ మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నగేష్ తండ్రి పాండురంగం సోమవారం మరణించిన విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే నగేష్ ఇంటికి వెళ్లి అతని తండ్రి పార్థివ దేహానికి నివాళులు అర్పించి, అంత్యక్రియలో పాల్గొని పాడేనుమోసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,వారికి ధైర్యాన్ని కల్పించారు.ఆయనతోపాటు పార్టీ మండల అధ్యక్షులు పరమేష్,నాయకులు నజీబ్,రాజు, అంబాదాస్,గోపాల్ తదితరులు ఉన్నారు.

కేశంపేట మండల అభివృద్ధికి అధికారులు
ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

-ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి.

-ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :

కేశంపేట్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కరోనా సమయంలో ప్రపంచం మొత్తం అతలాకుతలమైనప్పటికీ, ప్రజలందరం ఏకతాటిపై నిలబడి సమిష్టిగా కరోనాను ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావాన్ని కూడా సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. సర్వసభ్య సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలపై సమావేశంలో సమగ్రంగా చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గత సర్వసభ్య సమావేశంలో చర్చించిన సమస్యల్లో దాదాపు 70 శాతం పరిష్కరించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. మిగిలిన సమస్యలను కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, ఇళ్లు, పెన్షన్లు అందించడంలో నిర్లక్ష్యం జరిగిందని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలను గుర్తించి ఆయా పథకాల ద్వారా ఆదుకుంటోందని పేర్కొన్నారు. గతంలో భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతు బీమా వర్తించేదని, కానీ నేడు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతి కుటుంబ యజమానికి ఒక్క రూపాయి ప్రీమియం కూడా చెల్లించకుండా రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయడం గొప్ప విషయమని ఎమ్మెల్యే అన్నారు. పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ ఏడీ రమాదేవి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరు ఎంఎస్ఎఫ్
నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా చెరుకుపల్లి శశికుమార్ మాదిగ
ప్రధాన కార్యదర్శిగా కొయ్యల అనిల్ మాదిగ



నిడమనూరు, అక్టోబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :

సామాజిక పరివర్తకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిడమనూరు మండలంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల డిగ్రీ కళాశాలలో ఎంఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ నిడమనూరు మండల ఇన్‌చార్జి, సాగర్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు బొజ్జ చిన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు, జిల్లా పెద్దలు, నియోజకవర్గ సీనియర్ నాయకుడు పెరుమాళ్ల మట్టయ్య పాల్గొన్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా చెరుకుపల్లి శశికుమార్ మాదిగ, అధికార ప్రతినిధిగా సంపత్ కుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కొయ్యల అనిల్ మాదిగలను నియమించారు. ఈ కార్యక్రమంలో బి. వినయ్ మాదిగ, డి. శివ మాదిగ, తేజ మాదిగ, రాజు మాదిగ తదితరులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. నూతన కమిటీ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయుల కోసం విద్యార్థుల ఆవేదన..

కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో నిరసన
ఇంగ్లీష్, పీఈటీ టీచర్, ప్రధానోపాధ్యాయుడిని నియమించాలి
పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నా పట్టించుకునే వారేరీ?
కలెక్టర్, డీఈఓకు నామాపురం విద్యార్థుల వినతి



ఘట్టుప్పల్, నవంబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :

ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా.. మరోవైపు కనీసం అవసరమైన ఉపాధ్యాయులు కూడా లేక విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయుల కోసం విద్యార్థులే రోడ్డెక్కి నిరసన తెలిపే దుస్థితి ఏర్పడింది. తమ భవిష్యత్తును కాపాడాలంటూ చిన్నారులు అధికారుల ఎదుట ప్లకార్డులు పట్టుకుని నిలబడటం ప్రభుత్వ విద్యావ్యవస్థలో నెలకొన్న సమస్యలను ఎత్తిచూపుతోంది. ఘట్టుప్పల్ మండలం నామాపురం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఇంగ్లీష్, పీఈటీ ఉపాధ్యాయులతో పాటు ప్రధానోపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఇంగ్లీష్ బోధనకు ఉపాధ్యాయుడు లేకపోవడం తమ చదువులు, పరీక్షల సన్నద్ధతపై ప్రభావం చూపుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. శారీరక విద్యకు పీఈటీ ఉపాధ్యాయుడు లేకపోవడంతో క్రీడలు, వ్యాయామ కార్యక్రమాలు కూడా సక్రమంగా సాగడం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం విద్యార్థులు వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టరేట్ ఎదుటకు చేరుకున్నారు. 'కలెక్టర్ సార్.. మా బడికి ఇంగ్లీష్ టీచర్ కావాలి.. పీఈటీ టీచర్ కావాలి.. హెచ్ఎం కావాలి' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)కు వినతిపత్రం అందజేసి, వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత అని, ఉపాధ్యాయుల కొరత కారణంగా వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారకూడదని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ పేర్కొంది. విద్యార్థుల ఆందోళనను ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు తీవ్రంగా పరిగణించి తక్షణమే స్పందించాలని కోరింది. పదో తరగతి విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా ఇంగ్లీష్, పీఈటీ ఉపాధ్యాయులతో పాటు ప్రధానోపాధ్యాయుడిని వెంటనే నియమించి పాఠశాలలో విద్యాబోధనకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం..

మర్రిగూడ మండలం నవంబర్ 23..
(జర్నలిస్ట్ డైరీ) :

రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ లపంగి నర్సింహా గారి ఆధ్వర్యంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ లపంగి నర్సింహా గారు మాట్లాడుతూ గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబ సభ్యుడు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పొగాకు సైదులు, గ్రామపంచాయతీ కార్యదర్శి నాజీరా, వార్డు సభ్యులు భీమనగోని యాదయ్య, పగిళ్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా...
ప్రతి కుటుంబానికి భరోసాగా...

దేవరకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా రమావత్ రవీంద్ర కుమార్ జన్మదిన వేడుకలువార్తా నివేదన, 23 నవంబర్, చింతపల్లి మండలందేవరకొండ మాజీ శాసనసభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ గారి జన్మదిన వేడుకలను సోమవారం దేవరకొండ నియోజకవర్గ వ్యాప్తంగా బిఆర్ఎస్ పార్టీ



నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని దేవరకొండ, చందంపేట, గుడిపల్లి, పీఏ పల్లి, డిండి, కొండమల్లేపల్లి, చింతపల్లి, నేరడుగొమ్ము తదితర మండలాలు, గ్రామాల్లో పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. పలు గ్రామాల్లో కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించి, స్వీట్లు పంపిణీ చేసి, పేదలకు పండ్లు తదితర సేవా కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు రమావత్ రవీంద్ర కుమార్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.పదవులు ఉన్నా లేకున్నా ప్రజల మధ్య ఉంటూ, నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే నాయకుడిగా రవీంద్ర కుమార్ గారు ప్రజల అభిమానం సంపాదించుకున్నారని నాయకులు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి ప్రజలకు, పార్టీకి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా పండుగ వాతావరణంలో అభిమానులు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఉత్సాహం మధ్య ఘనంగా జరిగాయి.

సముద్రాల లక్ష్మమ్మ మృతి బాధాకరం

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్



దేవరకొండ, నవంబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :

దేవరకొండ టీ న్యూస్ రిపోర్టర్ సముద్రాల వేణు తల్లి సముద్రాల లక్ష్మమ్మ అకాల మరణం చాలా బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్ అన్నారు. దేవరకొండలోని వారి నివాసానికి చేరుకుని లక్ష్మమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని కోరుకున్నారు. వారి వెంట కేతావత్ హరి నాయక్, జైపాల్ నాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఐలు 12వ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

న్యాయవాదుల హక్కుల పరిరక్షణకు ఐలు నిరంతర పోరాటం
నవంబర్ 28న నల్లగొండలో జిల్లా మహాసభలు..
పోస్టర్ ఆవిష్కరణ



నల్లగొండ, నవంబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) 12వ నల్లగొండ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఐలు జిల్లా కార్యదర్శి అనంతుల శంకరయ్య, నల్లగొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ. సతీష్ కుమార్, కార్యదర్శి బి. అశోక్ కుమార్ న్యాయవాదులకు పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండ బార్ అసోసియేషన్ హాలులో ఐలు ఆధ్వర్యంలో జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 28న నల్లగొండలోని యూటీఎఫ్ భవనంలో 12వ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. వసంత్ పటేల్ హాజరుకానున్నట్లు వెల్లడించారు. న్యాయవాదుల హక్కుల పరిరక్షణతో పాటు సమాజంలో చోటుచేసుకుంటున్న అన్యాయాలపై ఐలు నిరంతరం పోరాటం సాగిస్తోందని పేర్కొన్నారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులు, వృత్తిపరమైన అంశాలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులతో పాటు న్యాయశాస్త్ర విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎన్.వి. రాఘవరావు, లెనిన్ బాబు, జి. జవహర్‌లాల్, నాగిరెడ్డి, ఎస్.ఆర్. ఠాగూర్, జి. లింగయ్య, టి. కిషోర్, డి. స్వామినాథ్, అప్రోజ్, భీమగాని గణేష్, శ్రీకాంత్, శంకర్ బాబు, వంశీకృష్ణ, రవీందర్ రావు, బి. నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి–సీఐ మన్మథ కుమార్



మహిళలు, బాలికల భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత-సీడబ్ల్యూసీ వాణి



సంస్థాన్ నారాయణపురం నవంబర్ 23:-
(జర్నలిస్ట్ డైరీ) :

సంస్థాన్ నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నారాయణపురం మండల కమిటీ ఆధ్వర్యంలో, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జింకల సాయి అధ్యక్షతన గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాల ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక దాడులపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చౌటుప్పల్ రూరల్ సీఐ మన్మథ కుమార్ మాట్లాడుతూ. విద్యార్థులు మంచి లక్షణాలను అలవర్చుకోవాలని, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. సీడబ్ల్యూసీ వాణి మాట్లాడుతూ. మహిళలు, బాలికలు మరియు చిన్నారుల భద్రతకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని అన్నారు. మహిళలు, బాలికలపై దాడులు, వేధింపులు జరిగినప్పుడు భయపడకుండా వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు మాట్లాడుతూ. విద్యా కేంద్రాలు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన కేంద్రాలని, అలాంటి విద్యా కేంద్రాల్లో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు తావులేకుండా చూడాలని అన్నారు. విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్న మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల్ల ఆరోగ్యమే తల్లిదండ్రులకు నిజమైన సంపద, భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని, తమ పరిసరాల్లో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం లేదా విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెంపొందించి, మత్తు పదార్థాల రహిత విద్యా కేంద్రాలుగా కళాశాలలను తీర్చిదిద్దడంతో పాటు మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కల్పించడమే ఈ సెమినార్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థాన్ నారాయణపురం ఎస్సై సీత పాండు, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్ జిల్లా కమిటీ సభ్యులు అరవింద్, వేణు తదితర నాయకులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ అండ.. రూ.53 వేల ఆర్థిక సాయం

మధుయాష్కి గౌడ్
చొరవతో మాధవ నగర్ కాలనీ సభ్యురాలికి చెక్కు

ఎల్బీనగర్
నవంబర్ 23 (జర్నలిస్ట్ డైరీ) :



అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) అండగా నిలిచింది. కర్మన్‌ఘాట్ డివిజన్ పరిధిలోని మాధవ నగర్ కాలనీకి చెందిన సభ్యురాలు పట్నం మంగమ్మ విష్ణువర్ధన్ రెడ్డి వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.53 వేల ఆర్థిక సాయం మంజూరైంది. మంగమ్మ ఆరోగ్య పరిస్థితి క్షీణించిన విషయం తెలుసుకున్న మాధవ నగర్ కాలనీ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్ వెంటనే స్పందించారు. ఈ విషయాన్ని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఏఐపీసీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి, బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. తన వంతు సహకారంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.53,000 మంజూరు చేయించడంలో చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్స చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్ మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న కాలనీ సభ్యురాలికి ఆర్థిక సాయం అందేలా చొరవ చూపిన మధుయాష్కి గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాగే మరింత మంది పేద, నిరుపేద కుటుంబాలకు వైద్య సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు బద్రీనాథ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జెండా దిమ్మె ఏర్పాటును అడ్డుకోవడంపై తురక కాశ సంఘం పోరుబాట!

చౌటుప్పల్-నారాయణపురం రోడ్డుపై రాష్ట్ర అధ్యక్షులు షేక్ బడే సాబ్ మెరుపు ధర్నా

రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని పోలీసుల హామీ-ధర్నా విరమణ



సంస్థాన్ నారాయణపురం నవంబర్ 23:-
(జర్నలిస్ట్ డైరీ) :

యాదాద్రి భువనగిరి జిల్లా, సంస్థాన్ నారాయణపూర్ మండలం గుడిమల్కాపురం గ్రామం తురక కాశ సంక్షేమ సంఘం జెండా దిమ్మె ఏర్పాటు విషయంలో స్థానికంగా కొందరు ప్రజాప్రతినిధులు అడ్డంకులు సృష్టించడంపై తురక కాశ సంఘం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సంఘం జెండాను ఏర్పాటు చేసుకునే హక్కును అడ్డుకోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ తురక కాశ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బడే సాబ్ ఆధ్వర్యంలో చౌటుప్పల్, నారాయణపురం ప్రధాన రహదారిపై మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు షేక్ బడే సాబ్ మాట్లాడుతూ. తురక కాశ సమాజం ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే సంఘం జెండా దిమ్మె ఏర్పాటును అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని, సమాజ ఐక్యతను దెబ్బతీసే చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. హక్కుల సాధన కోసం తురక కాశ సమాజం ఐక్యంగా ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ధర్నా విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ, సీఐలు సంఘటనా స్థలానికి చేరుకుని నాయకులతో చర్చలు జరిపారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి, జెండా దిమ్మెను తామే స్వయంగా ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. పోలీసు అధికారుల హామీని స్వాగతించిన రాష్ట్ర అధ్యక్షులు షేక్ బడే సాబ్ గారు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమం ద్వారా తురక కాశ సమాజం ఐక్యతను, ఆత్మగౌరవాన్ని, హక్కుల సాధన పట్ల ఉన్న పట్టుదలను మరోసారి చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె. లతీఫ్, ఇస్మాయిల్, సాహెబ్, హుస్సేన్, రఫీ, నజీర్, మోయినుద్దీన్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు యూసుఫ్ తదితర నాయకులతో పాటు భారీ సంఖ్యలో తురక కాశ సంఘం నాయకులు పాల్గొన్నారు

ఆర్మీ విన్యాసాల్లో అపశృతి..

- ట్యాంకు కింద నలిగి ఇద్దరు సైనికులు మృతి



చండీగఢ్

సైనిక శిక్షణ విన్యాసాల్లో అపశృతి జరిగింది. ట్యాంకు ఢీకొట్టడంతో దాని కింద నలిగి ఇద్దరు సైనికులు మరణించారు. ఈ సంఘటనపై ఆర్మీ అధికారులు, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హర్యానాలోని హిసార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం సైనిక శిక్షణలో భాగంగా సుమారు 32 ట్యాంకులతో యుద్ధ విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ధూళి గాలిలోకి లేచింది.కాగా, భారీ ధూళి కారణంగా ఒక ట్యాంకు డ్రైవర్‌కు ముందున్న మార్గం సరిగా కనిపించలేదు. ఈ నేపథ్యంలో ముందు ఉన్న ఇద్దరు సైనికులపైకి ఆ ట్యాంక్ దూసుకెళ్లింది. జవాన్ల పైనుంచి ఆ ట్యాంకు వెళ్లడంతో దాని కింది నలిగిన వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే హిసార్‌లోని మిలిటరీ ఆసుపత్రికి తరలించగా వారు అప్పటికే మరణించినట్లు డాక్టర్లు ధృవీకరించారు. మరోవైపు మరణించిన ఇద్దరు సైనికులను ఉత్తరప్రదేశ్‌లోని షామ్లీకి చెందిన నాయక్ మనీష్ కుమార్, బదాయూన్‌కు చెందిన నాయక్ అంకుశ్ కుమార్‌గా గుర్తించారు. ఆర్మీ అధికారులతో పాటు హిసార్ పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. మరణించిన జవాన్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

క్షుద్రపూజల కోసం.. పొరుగువారి కుమార్తెను చంపిన మహిళ



లక్నో:

ఇంటి బయట ఆడుకున్న బాలిక అదృశ్యమైంది. పోలీస్ డాగ్‌తో పోలీసులు గాలింపు చేపట్టగా పొరుగింటి మహిళ ఇంట్లో ఆ చిన్నారి మృతదేహం లభించింది. క్షుద్ర పూజలో భాగంగానే బాలికను ఆమె హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ మహిళను అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. భుద్ ప్రాంతంలో నివసించే మూడేళ్ల వానియా, శనివారం ఉదయం తన ఇంటి బయట ఆడుకున్నది. ఆ తర్వాత ఆ చిన్నారి అదృశ్యమైంది. ఆందోళన చెందిన బాలిక తల్లిదండ్రులు, బంధువులు ఆ చిన్నారి కోసం అంతటా వెతికారు. కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.కాగా, పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. ఇంటి సమీపంలోనే ఆ చిన్నారి అదృశ్యమైనట్లు గ్రహించారు. పోలీస్ డాగ్‌ను రప్పించారు. చిన్నారి దుస్తుల్లో ఒక దానిని వాసన చూపించారు. ఆ జాగిలం పొరుగున ఉన్న ఒక ఇంటిలోకి పోలీసులను తీసుకెళ్లింది. అక్కడ ఒక సంచిలో చిన్నారి మృతదేహం కనిపించింది. మరోవైపు బాలిక నోట్లో గుడ్డలు కుక్కడంతోపాటు చేతిపై కత్తి గాయం ఉండటాన్ని పోలీసులు గమనించారు. పొరుగున నివసించే మహిళ క్షుద్ర పూజలు చేస్తుందని తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో క్షుద్ర పూజల్లో భాగంగానే ఆ చిన్నారిని ఆమె హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ మహిళను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఆ చిన్నారి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. బాలిక కుటుంబ సభ్యులు, స్థానికులు ఆ మహిళ ఇంటి వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. కాగా, చిన్నారి హత్యకు కారణంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

క్యాంపస్ నియామకాలకు బ్రేక్!



న్యూఢిల్లీ

టెక్నాలజీ రంగంలో ఉద్యోగాల కోతల ఆందోళనలు మరింతగా పెరుగుతున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, డేటాబ్రిక్స్ తదితర సంస్థలు 2027లో భారత్‌లో క్యాంపస్ నియామకాలను నిలిపివేయనున్నాయనే ప్రచారం కలకలం రేపుతోంది.

టెక్ ప్రొఫెషనల్ రాయ్ నవంబర్ 22న ఎక్స్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. అయితే ఇది ప్రపంచవ్యాప్త నియామకాల నిలిపివేత కాదని, భారతీయ ఐఐటీల నుంచి క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన సమాచారమని స్పష్టం చేశారు.

24 గంటల్లో రాజీనామా చేయాలంటూ..

మరోవైపు బెంగళూరులోని గూగుల్ క్లౌడ్ విభాగంలో ఇప్పటికే ఉద్యోగాల కోతలు జరిగినట్లు బ్లైండ్ వేదికలో ఓ ఎల్4 ఉద్యోగి తెలిపారు. పనితీరుతో సంబంధం లేకుండానే కొందరిని తొలగిస్తున్నారని, 24 గంటల్లో రాజీనామా చేయాలని సూచించి, నెల జీతాన్ని పరిహారంగా ఇస్తున్నారని పేర్కొన్నారు.

మా నీళ్లు తాగడానికి సురక్షితమే..

- బ్రోమేట్ పరీక్షలపై బిస్లరీ క్లారిటీ



న్యూఢిల్లీ

బిస్లరీ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ సురక్షితం కాదంటూ భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ చేసిన ప్రకటనపై కంపెనీ స్పందించింది. తమ ఉత్పత్తులు తాగడానికి సురక్షితమేనని, నాణ్యత నియంత్రణలో భాగంగా కఠినమైన పరీక్షలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేసింది. గోవాలోని తమ తయారీ కేంద్రం నుంచి సేకరించిన నమూనాల పరీక్షల విషయంలో తలెత్తిన వివాదంపై వివరణ ఇచ్చింది. పరిమితికి మించి బ్రోమేట్ ఉన్నట్లు నమోదైన నమూనాను స్వతంత్ర ల్యాబ్‌లలో పరీక్షించగా, నిర్దేశిత పరిమితుల్లోనే ఉన్నట్లు తేలిందని పేర్కొంది.2025 సెప్టెంబర్ 30న గోవాలోని తమ తయారీ కేంద్రం నుంచి ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆరు నమూనాలను సేకరించిందని బిస్లరీ తెలిపింది. ప్రాథమిక పరీక్షల్లో ఐదు నమూనాలు అన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు తేలిందని పేర్కొంది. ఆరో నమూనాలో మాత్రం లీటరుకు 10 మైక్రోగ్రాముల బ్రోమేట్ పరిమితికి బదులుగా 12 మైక్రోగ్రాములు నమోదైనట్లు వెల్లడించింది. దీనిపై అప్పీల్ చేయగా, రిఫరల్ ల్యాబొరేటరీలో నిర్వహించిన పరీక్షల్లో బ్రోమేట్ స్థాయి నిర్దేశిత పరిమితిలోనే ఉన్నట్లు తేలిందని కంపెనీ వివరించింది. అదే నమూనాను ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు పొందిన మరో స్వతంత్ర ల్యాబొరేటరీలోనూ పరీక్షించగా, బ్రోమేట్ పరిమితికి లోబడే ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని పేర్కొంది. స్వతంత్ర పరీక్షల ఫలితాలను జతచేస్తూ 2026 ఫిబ్రవరి 2న ఎఫ్ఎస్ఎస్ఏఐ వెస్ట్రన్ రీజినల్ కార్యాలయానికి అధికారిక లేఖ పంపినట్లు బిస్లరీ తెలిపింది. అయితే ఆ తర్వాత సంస్థ నుంచి ఎలాంటి సమాచారం అందలేదని పేర్కొంది. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న నోటీసు తమకు ఈ-మెయిల్ ద్వారా గానీ, భౌతికంగా గానీ అందలేదని, ఎఫ్ఎస్-ఎస్ఏఐ వెబ్‌సైట్‌లోనూ ఆ నోటీసును గుర్తించలేకపోయామని వివరించింది. తాగునీటి భద్రత తమకు అత్యంత ప్రాధాన్యమని బిస్లరీ స్పష్టం చేసింది. తయారీ ప్రక్రియలో 10 దశల నాణ్యత నియంత్రణ విధానాన్ని అనుసరిస్తున్నామని, 90కి పైగా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న తమ తయారీ కేంద్రాల్లో కఠినమైన నాణ్యత ప్రమాణాలను అమలు చేస్తున్నామని పేర్కొంది. వినియోగదారులకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు కట్టుబడి ఉన్నామని, ఈ అంశంపై నియంత్రణ సంస్థతో తగిన ప్రక్రియలో సహకరిస్తామని వెల్లడించింది.

రష్యాకు భారీ దెబ్బ..

- అత్యాధునిక నౌక 'మెర్క్యురీ'ని జలసమాధి చేసిన ఉక్రెయిన్..
వీడియో పంచుకున్న జెలెన్‌స్కీ
-లిబియా తీరంలో రష్యా యుద్ధనౌక మెర్క్యురీని ముంచేసిన ఉక్రెయిన్
-దేశీయంగా తయారుచేసిన 7 నేవల్ డ్రోన్లతో మెరుపు దాడి
-నౌకతో పాటు రష్యా కేఫ-27 హెలికాప్టర్ కూడా ధ్వంసం
-ఆయుధాలు తీసుకెళ్తున్న రష్యా కార్గో నౌక ఎంవీ అంగారాపై దాడి
-142 ప్రాంతాల్లో ఉక్రెయిన్ స్థావరాలపై విరుచుకుపడ్డామన్న రష్యా



న్యూఢిల్లీ

లిబియా తీరంలో రష్యా నౌకాదళానికి ఉక్రెయిన్ భారీ షాక్ ఇచ్చింది. రష్యాకు చెందిన అత్యాధునిక యుద్ధనౌక (కార్వెట్) 'మెర్క్యురీ'ని ఉక్రెయిన్ బలగాలు విజయవంతంగా ముంచేశాయి. ఈ దాడి కోసం స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఏడు నేవల్ డ్రోన్లను ఉపయోగించినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సోమవారం అధికారికంగా ప్రకటించారు. దీంతో పాటు శత్రువు ఆయుధ రవాణాకు ఉపయోగిస్తున్న 'ఎంవీ అంగారా' అనే రష్యన్ సరుకు రవాణా (కార్గో) నౌకను కూడా తాము విజయవంతంగా దెబ్బతీశామని ఆయన వెల్లడించారు. రష్యా దురాక్రమణకు దీటుగా ఉక్రెయిన్ చేపట్టిన అత్యుత్తమ ఆపరేషన్ ఇదని జెలెన్‌స్కీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈ దాడిని తిప్పికొట్టేందుకు రష్యా బలగాలు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. ఉక్రెయిన్ డ్రోన్ల దాడి ధాటికి రష్యా యుద్ధనౌక మునిగిపోయిందని తెలిపారు. ఈ 'మెర్క్యురీ' నౌక రష్యా నౌకాదళంలో అత్యంత సరికొత్తది అని, ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి యుద్ధం మొదలైన తర్వాతే 2023లో దీన్ని రష్యా సైన్యంలోకి చేర్చుకున్నారని ఆయన వివరించారు. ఈ నౌక మునిగిపోవడంతో పాటు దానిపై ఉన్న 'కేఏ-27' పోరాట హెలికాప్టర్ కూడా పూర్తిగా ధ్వంసమైందని తెలిపారు. ఈ క్లిష్టమైన ఆపరేషన్‌లో పాలుపంచుకున్న ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీస్, రక్షణ బలగాల సైనికులను జెలెన్‌స్కీ అభినందించారు. నిర్దేశిత జలాల్లో తమ సైనిక చర్యలు కొనసాగుతాయని, సొంత ఆయుధాలను మరింతగా అభివృద్ధి చేసుకుంటూ రష్యా దాడిని తిప్పికొడతామని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, ఉక్రెయిన్ భూభాగంపై తాము పెద్ద ఎత్తున ప్రతిదాడులు చేపట్టినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గత 24 గంటల్లో ఉక్రెయిన్ సైన్యానికి చెందిన డ్రోన్ తయారీ కేంద్రాలు, నిల్వ ప్రాంతాలు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ రాడార్ స్టేషన్లు, సైనిక స్థావరాలపై క్షిపణులు, రాకెట్లు, డ్రోన్లతో విరుచుకుపడినట్లు తెలిపింది. రష్యన్ వార్తా సంస్థ టాస్ ప్రకారం.. మొత్తం 142 జిల్లాల్లోని ఉక్రెయిన్ ఇంధన, రవాణా మౌలిక సదుపాయాలు, ఆయుధ డిపోలు, సైనిక విమానాశ్రయాలు, విదేశీ సైనికులు తలదాచుకున్న ప్రాంతాలను రష్యా బలగాలు లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించాయి.

ఉగ్రదాడికి ముందే పహల్గాంపై చైనా నిఘా!

-దాడికి ఆరు రోజుల ముందు ఆ ప్రాంతంపై నిఘా పెంచేలా ఉపగ్రహ కక్ష్యలో మార్పులు
-దాడికి ముందు, తర్వాత 37 అసాధారణ కదలికలు
-గుర్తించిన అంతరిక్ష సంస్థ బిగంతర



న్యూఢిల్లీ:

గత ఏడాది ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడికి ముందు రోజుల్లో చైనా భూపరిశీలన ఉపగ్రహాలు ఆ ప్రాంతంపై దృష్టి పెట్టేందుకు అసాధారణంగా 37 కక్ష్య మార్పులు చేశాయని బెంగళూరుకు చెందిన అంతరిక్ష నిఘా స్టార్టప్ దిగంతర విశ్లేషణ తెలిపింది. దాడి జరిగిన రోజే రెండు ఉపగ్రహాలు ఆ ప్రాంతంపై మరింత తరచుగా దాటివెళ్లేందుకు తమ కక్ష్యలను మార్చుకున్నాయని ది ప్రింట్‌కు ప్రత్యేకంగా అందిన ఈ నివేదిక పేర్కొన్నది. అంతరిక్ష పరిధి అవగాహన వ్యవస్థ (ఎస్‌డీఏ) కింద బెంగళూరుకు చెందిన డిగంతర నిర్వహించిన విశ్లేషణ ప్రకారం.. 2025 ఏప్రిల్ 15 నుంచి 30 వరకు చైనా ఉపగ్రహాలు 37 ముందస్తు ప్రణాళికగా కక్ష్య మార్పులు చేశాయి. దీంతో పహల్గాంపై అవి దాటివెళ్లే సందర్భాలు పెరిగాయి. సాధారణ కక్ష్య మార్గాలకు భిన్నంగా జరిగిన ఈ మార్పులను దాడికి ముందే ప్రణాళిక వేసి ఉండొచ్చని సంస్థ శాస్త్రవేత్తలు భావించారు. దాడికి కనీసం ఆరు రోజుల ముందే ఈ అసాధారణ కదలికలు మొదలయ్యాయి. ఏప్రిల్ 16న యావోగాన్-35 01ఎ ఉపగ్రహం తన కక్ష్యను మార్చి పహల్గాంపై దాటివెళ్లే సంఖ్యను రెట్టింపు చేసుకున్నది. దాడి రోజున హత్యలు జరిగిన తర్వాత యావోగాన్-39 01బీ, యావోగాన్-39 01సీ ఉపగ్రహాలు సాయంత్రం 5.14 గంటలకు, 5.59 గంటలకు కక్ష్య మార్పులు చేశాయి.

తప్పించుకొనే మార్గాల కోసం...

ఈ కక్ష్య మార్పులకు ఉగ్రదాడితో ఉన్న సంబంధాన్ని నివేదిక నిర్ధారించలేదు. అయితే, భద్రతా దళాల కదలికలను గమనించడానికి లేదా ఉగ్రవాదులు తప్పించుకునే మార్గాలను అంచనా వేయడానికి ఆ ప్రాంతాన్ని ఉపగ్రహాల ద్వారా పర్యవేక్షించి ఉండొచ్చన్న ఊహకు ఇవి సంకేతాలని వర్గాలు తెలిపాయి. అయితే ఇది ధ్రువీకరించని ఊహ మాత్రమే. దాడి తర్వాత కూడా ఈ కదలికలు తగ్గలేదు. ఏప్రిల్ 29, 30 తేదీల్లో మళ్లీ గరిష్ఠ స్థాయికి చేరాయి. ఎంపిక చేసిన ప్రాంతాన్ని మరింత దగ్గరగా, స్పష్టంగా పరిశీలించేందుకు అనువైన దిగువ భూకక్ష్యలోని చైనా ఉపగ్రహాలు ఏప్రిల్ 29న 37 కక్ష్య మార్పులు, ఏప్రిల్ 30న 31 కక్ష్య మార్పులు చేశాయి. ఉపగ్రహ కక్ష్య మార్పు అంటే.. భూమిపై ఎక్కడ, ఎప్పుడు దాటివెళ్లాలో మార్చేలా ఉపగ్రహ కక్ష్య, దిశ లేదా వేగంలో నియంత్రిత మార్పు చేయడం. ఈ కక్ష్య సర్దుబాట్లతో ఉపగ్రహాలు పహల్గాంపై మరిన్ని సార్లు దాటివెళ్లగలిగాయి. దీంతో ఆ ప్రాంతాన్ని గమనించడానికి వాటికి ఎక్కువ అవకాశాలు లభించాయి.

అమెరికా సంస్థకు అభ్యర్థనలు

2025 ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పౌరులు మరణించారు. ఉగ్రదాడి జరిగిన నెల తర్వాత పహల్గాం ప్రాంత ఉపగ్రహ చిత్రాల కోసం అమెరికాకు చెందిన ఒక ఉపగ్రహ సంస్థకు దాడికి కొన్ని వారాల ముందే అభ్యర్థనలు భారీగా పెరిగినట్లు ది ప్రింట్ ప్రత్యేక కథనాల్లో వెల్లడించింది. దాడి ప్రణాళికకు, తర్వాత ఉగ్రవాదులు తప్పించుకునేందుకు ఆ చిత్రాలను ఉపయోగించి ఉండే అవకాశాన్ని అది ప్రస్తావించింది. పాకిస్థాన్ 2025లో తన ఉపగ్రహ కార్యక్రమాన్ని పునరుద్ధరించిందని, 2025 జనవరి నుంచి 2026 జూన్ వరకు 16 నెలల్లో ఆరు ఉపగ్రహాలను ప్రయోగించిందని ది ప్రింట్ గతంలో వెల్లడించింది. వీటిలో ఐదు ప్రయోగాలకు చైనా సహకరించింది.

చైనా నుంచి బంగ్లాకు క్షిపణి తయారీ సామగ్రి

-లక్షలాది సిమ్ కార్డులూ స్వాధీనం



ఢాకా

చైనా నుంచి బంగ్లాదేశ్‌కు వెళ్తున్న ఓ నౌకలో 405 టన్నుల సోడియం పెర్క్లోరేట్ రసాయనంతో పాటు లక్షలాది ఖాళీ సిమ్ కార్డులను ఇండోనేషియా నేవీ స్వాధీనం చేసుకున్నదని స్థానిక మీడియా తెలిపింది. రాకెట్, క్షిపణి ఇంధనాల తయారీలో వాడే శక్తిమంతమైన దహన ప్రేరక రసాయనమే సోడియం పెర్క్లోరేట్. కోమొరోస్ జెండాతో ప్రయాణిస్తున్న ఎంవీ స్టార్ లైన్ నౌకను ఈనెల 7న చైనా నుంచి బంగ్లాదేశ్‌కు వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు బంగ్లాదేశ్ మీడియా సంస్థ ఢాకా ట్రిబ్యూన్ తెలిపింది. నౌకలోని 36 కంటెయినర్లలో 15 కంటెయినర్లలో 405 టన్నుల సోడియం పెర్క్లోరేట్ ఉన్నట్లు ప్రకటించారు.ఇండోనేషియా నేవీ ప్రాంతీయ కమాండ్-1 కమాండర్ రియర్ అడ్మిరల్ డెన్నీ సెప్టియానా తెలిపిన వివరాల ప్రకారం, ఇంధనం నింపుకోవడానికి బెలవాన్ తీర జలాల్లో నౌక లంగరు వేసింది. ఆ సమయంలో ఇండోనేషియా నేవీ గస్తీ నౌక కేఆర్ఐ సిగాలు-857లోని సిబ్బంది అనుమానాస్పద కదలికలను గుర్తించారని ఇండోనేషియా మీడియా సంస్థ వాస్పదా ఐడీ తెలిపింది. కేఆర్ఐ సిగాలు కమాండర్ కోఆర్మాడా-1 ప్రధాన కార్యాలయంతో సమన్వయం చేసుకొని సమగ్ర తనిఖీలకు ఆదేశించారు. 36 కంటెయినర్లను తనిఖీ చేసిన నేవీ సిబ్బందికి 15 కంటెయినర్లలో 405 టన్నుల సోడియం పెర్క్లోరేట్, ఖాళీ 4జీ ఎల్‌టీఈ సిమ్ కార్డులు భారీ మొత్తంలో లభించినట్లు సమాచారం.

బిజినెస్

భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు..

-ఇన్వెస్టర్ల సంపద రూ.5 లక్షల కోట్లు ఆవిరి..!



దేశీయ స్టాక్ మార్కెట్ లు భారీ నష్టాలతో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు ఆ తర్వాత క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. బ్యాంక్ షేర్లు, మెటల్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలను పడగొట్టాయి. దాంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 1500 పాయింట్లు కోల్పోయింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (చీజు) సూచీ నిఫ్టీ 450 పాయింట్లు పతనమై 25,400 దిగువకు పడిపోయింది.ఇటీవల వరుసగా మార్కెట్లు రాణించిన వేళ ఇన్వెస్టర్‌లు అమ్మకాలకు దిగడం మార్కెట్ల పతనానికి ప్రధాన కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ. 5 లక్షల కోట్లు క్షీణించి రూ. 508 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఇవాళ ఉదయం 84,421.97 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో 84,662.96 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ ఆ తర్వాత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 82,395.88 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1483.72 పాయింట్ల నష్టంతో 82,435.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 450.95 పాయింట్ల నష్టంతో 25,349.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.91గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.

భారీగా పెరిగిన బంగారం ధరలు

- సోమవారం పసిడి ధరల్లో భారీ పెరుగుదల
- 22 క్యారెట్ల 10 గ్రాములపై రూ.1,350 పెంపు
- రూ.1,16,000కు చేరిన 22 క్యారెట్ల బంగారం
- 24 క్యారెట్ల 10 గ్రాములపై రూ.1,480 పెరుగుదల
- రూ.1,26,560కు చేరిన 24 క్యారెట్ల పసిడి
- వెండి ధరలో మాత్రం ఎలాంటి మార్పులేదు
- కిలో వెండి ధర రూ.1,75,000 వద్ద స్థిరం
- తెలుగు రాష్ట్రాల్లోనూ ఇవే ధరలు



హైదరాబాద్:
బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు సోమవారం భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు, పెట్టుబడిదారుల కొనుగోళ్ల ప్రభావంతో పసిడి ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. తాజా పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు బంగారం కొనుగోలు మరింత భారంగా మారింది. పెళ్లిళ్లు, శుభకార్యాల కోసం ఆభరణాలు కొనుగోలు చేయాలనుకునే వారు ధరల పెరుగుదలతో ఆలోచనలో పడుతున్నారు. బులియన్ మార్కెట్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ. 1,350 పెరిగింది. దీంతో ఈ ధర రూ. 1,16,000కు చేరింది. అదేవిధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 1,480 పెరిగి రూ. 1,26,560 వద్ద కొనసాగుతోంది. ఒక్కరోజులోనే రెండు రకాల బంగారం ధరల్లో గణనీయమైన పెరుగుదల నమోదైంది. మరోవైపు వెండి ధర మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. కిలో వెండి ధర రూ. 1,75,000 వద్ద ఎలాంటి మార్పు లేకుండా ఉంది. బంగారం ధరలు పెరిగినప్పటికీ వెండి ధరలో కదలిక లేకపోవడం గమనార్హం. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇవే ధరలు అమల్లో ఉండనున్నాయి. అయితే ఆభరణాల కొనుగోలుపై అదనంగా మూడు శాతం వస్తు సేవల పన్ను, తయారీ ఛార్జీలు వర్తిస్తాయి. ప్రాంతాన్ని బట్టి ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉండే అవకాశం ఉంది.

బంగారు రుణం తీసుకుంటున్నారా.. ఈ జాగ్రత్తలు తప్పనిసరి!

- అవసరాల కోసం బంగారంపై రుణం తీసుకునే ముందు అప్రమత్తత అవసరం
- ఆభరణాల విలువను ముందుగానే అంచనా వేయించుకోవాలి
- వడ్డీ రేట్లపై వివిధ బ్యాంకుల మధ్య పోలిక చేసుకోవాలి
- ప్రాసెసింగ్ రుసుములు, ఇతర ఛార్జీల వివరాలు తెలుసుకోవాలి
- బంగారం స్వచ్ఛత, తూకం విషయంలో స్పష్టత ఉండాలి
- ఆభరణాల భద్రతకు సంబంధించిన నిబంధనలు పరిశీలించాలి
- తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని అంచనా వేసుకోవాలి
- ఒప్పంద పత్రాలను పూర్తిగా చదివిన తర్వాతే సంతకం చేయాలి
- అవసరమైన మేరకే రుణం తీసుకోవాలని నిపుణుల సూచన



హైదరాబాద్:
అత్యవసర ఆర్థిక అవసరాల కోసం బంగారంపై రుణం తీసుకునే వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో నిపుణులు పలు జాగ్రత్తలు సూచిస్తున్నారు. తక్కువ సమయంలో రుణం లభిస్తుందనే ఉద్దేశంతో తొందరపడి నిర్ణయం తీసుకోకుండా, వడ్డీ రేట్లు, రుణ నిబంధనలు, ఇతర ఛార్జీలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెబుతున్నారు. ముఖ్యంగా రుణం తీసుకునే ముందు తాకట్టు పెట్టే బంగారం విలువను సరిగా అంచనా వేయించుకోవడం అవసరమని సూచిస్తున్నారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అందించే వడ్డీ రేట్లను పోల్చి చూసిన తర్వాతే రుణదాతను ఎంపిక చేసుకోవాలి. వడ్డీతోపాటు ప్రాసెసింగ్ రుసుములు, ఆలస్య రుసుములు, ఇతర ఛార్జీల వివరాలను ముందుగానే తెలుసుకోవాలి. ఆభరణాల స్వచ్ఛత, తూకం, వాటికి నిర్ణయించిన విలువ విషయంలో రుణదాత నుంచి స్పష్టమైన సమాచారం తీసుకోవాలి. తాకట్టు పెట్టిన బంగారాన్ని భద్రపరిచే విధానం, రుణం చెల్లించిన తర్వాత ఆభరణాలను తిరిగి అప్పగించే నిబంధనలను కూడా పరిశీలించాలి. రుణ ఒప్పందంపై సంతకం చేసే ముందు ప్రతి నిబంధనను క్షుణ్ణంగా చదవాలి. నెలవారీ వాయిదాలు లేదా నిర్ణీత గడువులో చెల్లించాల్సిన మొత్తంపై అవగాహన కలిగి ఉండాలి. ఆదాయం, ఖర్చులను బట్టి తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని అంచనా వేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అవసరానికి మించి రుణం తీసుకుంటే వడ్డీ భారం పెరిగి ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అందువల్ల అత్యవసరంగా అవసరమైన మొత్తానికే పరిమితమై, ముందస్తు చెల్లింపు ప్రణాళికతో రుణం తీసుకోవడం మంచిదని చెబుతున్నారు.

స్పోర్ట్స్

డబ్ల్యూటీసీ రేసులో ముదురుతున్న ఉత్కంఠ భారత్‌కు మిగిలిన ఆరు మ్యాచ్‌లు.. గెలిస్తేనే ఛాన్స్!

వెల్లింగ్టన్ టెస్టు డ్రాతో 50కి పడిపోయిన భారత డబ్ల్యూటీసీ పాయింట్ల శాతం

పాయింట్ల పట్టికలో నాలుగో స్థానానికి పరిమితమైన టీమిండియా

ఫైనల్ చేరాలంటే మిగిలిన 6 టెస్టుల్లోనూ కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితి

కివీస్‌తో రెండో టెస్టు, ఆసీస్‌తో 5 టెస్టులు అత్యంత కీలకం

అన్ని మ్యాచ్‌లు గెలిచినా భారత్ పీసీటీ గరిష్ఠంగా 66.67 శాతానికే పరిమితం

ఒక మ్యాచ్ ఓడినా లేదా డ్రా అయినా ఫైనల్ ఆశలు ఆవిరి



ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025-27 ఫైనల్ చేరాలన్న భారత జట్టు ఆశలకు న్యూజిలాండ్‌తో జరిగిన వెల్లింగ్టన్ టెస్ట్ డ్రా ఫలితం గట్టి దెబ్బ తీసింది. గెలిచే మ్యాచ్‌ను డ్రాగా ముగించాల్సి రావడంతో పాయింట్ల పట్టికలో సమీకరణాలు ఒక్కసారిగా సంక్లిష్టంగా మారాయి. వచ్చే ఏడాది జూన్‌లో లార్డ్స్ మైదానంలో జరగనున్న తుది సమరానికి అర్హత సాధించే మార్గం గిల్ సేనకు ఇప్పుడు అత్యంత క్లిష్టమైన సవాలుగా పరిణమించింది. ఈ డ్రా ఫలితంతో భారత్ పాయింట్ల శాతం (పీసీటీ) 51.52 నుంచి సరిగ్గా 50 శాతానికి పడిపోయింది. ప్రస్తుత సర్కిల్‌లో భారత జట్టు ఇప్పటివరకు 12 టెస్టులు ఆడి ఐదు విజయాలు, నాలుగు ఓటములు, మూడు డ్రాలతో పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలోనే కొనసాగుతోంది. అటు న్యూజిలాండ్ కూడా రెండో స్థానం నుంచి 66.67 శాతంతో మూడో స్థానానికి పడిపోయింది. భారత్ ఇంకా ఫైనల్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించనప్పటికీ, నాకౌట్ చేరే దారులు మాత్రం కష్టంగా మారాయి. ప్రస్తుత సైకిల్‌లో భారత్‌కు ఇంకా ఆరు టెస్ట్ మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. వీటిలో న్యూజిలాండ్‌తో క్రైస్ట్‌చర్చ్‌లో జరగనున్న రెండో టెస్టుతో పాటు, వచ్చే ఏడాది స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగే ప్రతిష్ఠాత్మక ఐదు టెస్టుల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ ఉంది. భారత్ ఫైనల్ రేసులో పోటీ పడాలంటే ఈ మిగిలిన ఆరు టెస్టుల్లోనూ తప్పనిసరిగా విజయం సాధించాల్సిందే. అలా అన్ని మ్యాచ్‌లూ గెలిస్తేనే భారత పీసీటీ గరిష్ఠంగా 66.67 శాతానికి చేరుకుంటుంది. అయితే అంత చేసినా ఫైనల్ బెర్త్ ఖాయమని చెప్పలేం. ఇతర జట్ల గెలుపోటములపై ఆధారపడాల్సి వస్తుంది. ఇందులో ఒక్క మ్యాచ్ ఓడినా లేదా డ్రా అయినా టీమిండియా ఫైనల్ కలలు దాదాపు గల్లంతైనట్లే.

భారత్-పాక్ 'నో హ్యాండ్‌షేక్'పై ఎంసీసీ ఏం చెప్పిందంటే..?

భారత్-పాక్ రైజింగ్ స్టార్స్ మ్యాచ్‌లో కరచాలనం చేసుకోని ఇరుజట్ల ఆటగాళ్లు

ఇది తమ పరిధిలో లేని అంశమని స్పష్టం చేసిన ఎంసీసీ

టెస్ట్ క్రికెట్‌లో నో-బాల్స్‌కు ఫ్రీ హిట్ ఇచ్చే ఆలోచనను పరిశీలిస్తున్న ఎంసీసీ



భారత్, పాకిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య మైదానంలో ఉండే తీవ్రమైన పోటీ మరోసారి వార్తల్లో నిలిచింది. నిన్న దోహాలో జరిగిన ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ మ్యాచ్ అనంతరం ఇరుజట్ల ఆటగాళ్లు కరచాలనం (షేక్‌హ్యాండ్) చేసుకోకుండానే మైదానాన్ని వీడారు. గత ఏడాది దుబాయ్‌లో జరిగిన ఆసియా కప్ నుంచి భారత క్రికెట్ జట్లు పాకిస్థాన్‌తో మ్యాచ్‌ల సమయంలో ఈ సంప్రదాయాన్ని పాటించడం లేదు. ఈ వివాదంపై క్రికెట్ చట్టాల పరిరక్షణా సంస్థ అయిన 'మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్' (ఎంసీసీ) స్పందించింది. ఆటగాళ్లు కరచాలనం చేసుకోవాలని తాము కోరుకుంటామని, అయితే ఈ విషయంలో తమ నియంత్రణ చాలా తక్కువని స్పష్టం చేసింది. ఈ విషయంపై ఎంసీసీ లాస్ మేనేజర్, హెడ్ ఆఫ్ క్రికెట్ అయిన ఫ్రేజర్ స్టీవార్ట్ మాట్లాడుతూ.. "షేక్‌హ్యాండ్‌ల విషయంలో పైస్థాయి నుంచి ఆదేశాలు వస్తున్నప్పుడు, దానిని ఎంసీసీ నియంత్రించలేదు. ఆటగాళ్లు కరచాలనం చేసుకోవడాన్ని మేము చూడాలనుకుంటున్నాం. కానీ దీని వెనుక పెద్ద అంశాలు ఉన్నాయని మాకు తెలుసు. ఇది మా నియంత్రణకు మించిన విషయం" అని వివరించారు. భారత్-పాక్ మ్యాచ్‌లలో షేక్‌హ్యాండ్ చేసుకోకపోవడంపై నేరుగా వ్యాఖ్యానించడానికి ఆయన నిరాకరించారు. "కొన్ని అంశాలు క్రికెట్‌ను మించి ఉంటాయి. అవి భౌగోళిక, రాజకీయ పరిస్థితులకు సంబంధించినవి. వాటిపై మాట్లాడటం నా స్థాయికి మించిన విషయం. మా నియంత్రణలో ఉండేది ఒక్కటే. మైదానంలో ఆటగాళ్లు ఒకరినొకరు గౌరవించుకోవాలి, అంపైర్లను, వారి అధికారాన్ని గౌరవించాలి" అని స్టీవార్ట్ తెలిపారు.

2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో రోహిత్, కోహ్లీ!

-2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్, కోహ్లీ ఉండే అవకాశం

-దక్షిణాఫ్రికాలో వారి అనుభవం జట్టుకు అవసరమన్న బీసీసీఐ వర్గాలు

-ఫిట్‌నెస్, ఆడేందుకు ఆసక్తి ఉంటేనే జట్టులో కొనసాగింపు

-ఇప్పటికే టెస్టులు, టీ20ల నుంచి రిటైరైన ఇద్దరు ఆటగాళ్లు



భారత క్రికెట్ జట్టు సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల భవిష్యత్తుపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. 2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో ఈ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు అంతర్భాగంగానే ఉంటారని బీసీసీఐ వర్గాల సమాచారం. వారు పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండి, ఆడేందుకు ఆసక్తి కనబరిస్తే జట్టులో కొనసాగుతారని తెలుస్తోంది. 2027లో దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా ఈ మెగా టోర్నమెంట్ జరగనుంది. ముఖ్యంగా దక్షిణాఫ్రికా పిచ్‌లపై వారిద్దరి అపార అనుభవం జట్టుకు ఎంతో అవసరమని బీసీసీఐకి చెందిన ఒక సీనియర్ అధికారి అభిప్రాయపడ్డారు. "దక్షిణాఫ్రికాలో గెలవాలంటే రోహిత్, విరాట్ మనకు కావాలి. వారిద్దరూ లేకుండా మనం అక్కడ విజయం సాధించడం కష్టం" అని ఆయన స్పష్టం చేశారు. రోహిత్, కోహ్లీలు లెజెండ్స్ అని, ఎంతకాలం ఆడాలనేది వారి వ్యక్తిగత నిర్ణయానికే వదిలేయాలని సదరు అధికారి వ్యాఖ్యానించినట్లు సమాచారం.ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో రోహిత్, కోహ్లీ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. నాలుగు ఇన్నింగ్స్‌లలో రోహిత్ కేవలం 30 పరుగులు చేయగా, కోహ్లీ 86 పరుగులు మాత్రమే సాధించాడు. అయినప్పటికీ, వారి అనుభవంపై బీసీసీఐ గట్టి నమ్మకం ఉంచినట్లు ఈ వార్తలు సూచిస్తున్నాయి. రోహిత్, కోహ్లీలు ఇప్పటికే టెస్టులు, టీ20 ఫార్మాట్ల నుంచి రిటైర్ అయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వారు కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు. 2027 ప్రపంచకప్‌నకు ముందు భారత్ పరిమిత సంఖ్యలోనే వన్డే మ్యాచ్‌లు ఆడనుంది. డిసెంబర్‌లో శ్రీలంకతో, జనవరిలో జింబాబ్వేతో సిరీస్‌లు జరగనున్నాయి. అయితే, రోహిత్, కోహ్లీల భవిష్యత్తుపై బీసీసీఐ ఇప్పటివరకు అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు.

తొలి వీకెండ్‌లోనే రూ.101 కోట్లు..

-బాక్సాఫీస్ వద్ద ధనుష్ 'ఓం' సంచలనం!



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన తాజా చిత్రం 'ఓం: ఆపరేషన్ మోల్ (ఫావ్: ఖాజావతీఖ్అశీల వీశీశ్రీవ)' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతోంది. విడుదలైన తొలి వీకెండ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లను సాధించి కీలకమైన మైలురాయిని అందుకుంది. సినిమా మేకర్స్ అధికారికంగా ప్రకటించిన వివరాల ప్రకారం, తొలి మూడు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.101 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. సినిమా విడుదలైన తర్వాత మిక్స్‌డ్ నుంచి ఓ మోస్తరు రివ్యూలు వచ్చినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద మాత్రం ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. తొలి వీకెండ్ వసూళ్లతో రూ.100 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టడం చిత్ర బృందానికి మంచి ఊరటనిచ్చింది. ముఖ్యంగా వీకెండ్ రోజుల్లో ప్రేక్షకుల ఆదరణ సినిమాకు కలెక్షన్ల పరంగా బలాన్ని అందించింది.అయితే సోమవారం నుంచి సినిమా వసూళ్లు ఎలా ఉంటాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వీకెండ్ తర్వాత సాధారణంగా కలెక్షన్లు తగ్గే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో వారాంతపు వసూళ్లను నిలబెట్టుకుంటూ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రదర్శన కొనసాగిస్తుందో చూడాలి. ప్రేక్షకుల ఆదరణ, రాబోయే రోజుల్లో వసూళ్ల ట్రెండ్‌ను బట్టి సినిమా మరింత భారీ వసూళ్లు సాధించే అవకాశాలు ఉంటాయి.ఈ చిత్రంలో ధనుష్‌తో పాటు మమ్ముట్టి, సాయి పల్లవి, శ్రీలీల, ఇంద్రన్స్, నసీరుద్దీన్ షా వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటించారు. విభిన్న ప్రతిభ కలిగిన నటీనటులు ఒకే సినిమాలో భాగం కావడం సినిమాపై ముందునుంచే ఆసక్తిని పెంచింది. వండర్‌బార్ ఫిల్మ్స్, ఆర్‌టేక్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. సాయి అభ్యంకర్ సంగీతం అందించారు. భారీ తారాగణం, ఆసక్తికరమైన కథాంశంతో రూపొందిన ఈ చిత్రం తొలి వీకెండ్‌లోనే రూ.101 కోట్ల గ్రాస్ సాధించడంతో ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద మరింత ముందుకు వెళ్తుందా? అనేది ఆసక్తిగా మారింది. ప్రస్తుతం తొలి వీకెండ్ వసూళ్లతో సత్తా చాటిన 'ఓం: ఆపరేషన్ మోల్'కు రాబోయే రోజులు కీలకంగా ఉండనున్నాయి. సోమవారం నుంచి సినిమా కలెక్షన్లు నిలకడగా కొనసాగితే, మరిన్ని బాక్సాఫీస్ రికార్డులు అందుకునే అవకాశం ఉంది.

కామన్‌మెన్ టార్గెట్‌గా 'ఇగో రాజా'



ఆది సాయికుమార్ ప్రధానపాత్ర పోషిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఈగో రాజా'. కోలీవుడ్ నటుడు సతీశ్ కీలక పాత్రధారి. శరణ్య రామచంద్రన్ కథానాయిక. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి గురు శరవణన్ దర్శకుడు. జి.సురేశ్ నిర్మాత. సినిమా నిర్మాణ దశలో ఉన్నది.ప్రమోషన్‌లో భాగంగా ఈసినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. అగ్ర హీరో రవితేజ టీజర్‌ని ఆవిష్కరించి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. లోన్ యాప్స్.. తద్వారా వచ్చే పర్యవసానాలు, ఆత్మహత్యలు తదితర అంశాల నేపథ్యంలో ఈ కథ సాగుతుందని టీజర్ చెబున్నది. మాస్ లుక్‌లో ఆదిసాయికుమార్, కామెన్ మెన్‌లా సతీశ్ కనిపిస్తున్నారు. శరణ్య రామచంద్రన్ గ్లామర్ ఈ టీజర్‌కు స్పెషల్ ఎట్రాక్షన్.

కిరణ్ అబ్బవరం కొత్త సినిమా 'రికార్డ్'..

- ఫస్ట్ లుక్‌తో ఆసక్తి పెంచిన మేకర్స్!



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన నటించిన 'రియాలిటీ' సినిమా విడుదలకు సిద్ధమవుతుండగా, తాజాగా తన తదుపరి చిత్రాన్ని ప్రకటించారు. కిరణ్ అబ్బవరం కెరీర్‌లో 14వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'రికార్డ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేయడంతో సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ లుక్ పోస్టర్‌లో స్మార్ట్‌ఫోన్‌ను చూపించి ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ క్రియేట్ చేశారు. తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్‌లో రక్తం రంగులో కనిపిస్తున్న ఎర్రటి పౌర్ణమి నేపథ్యంలో ఓ గుర్రం కనిపిస్తోంది. ఈ పోస్టర్ చూస్తుంటే సినిమా ఏదో విభిన్నమైన కథాంశంతో తెరకెక్కనున్నట్లు అనిపిస్తోంది. అయితే కథ, పాత్రలు, జానర్‌కు సంబంధించిన వివరాలను మేకర్స్ ఇంకా వెల్లడించలేదు.ఈ చిత్రానికి సంబంధించి నేడు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. కిరణ్ అబ్బవరం గత సినిమాలకు భిన్నంగా ఈ ప్రాజెక్ట్ ఉండబోతుందా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. 'రికార్డ్' సినిమాను వంశీ నందిపాటి, అశోక్ బండ్రెడ్డి నిర్మిస్తున్నారు. వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్, సుకుమార్ రైటింగ్స్, థీ స్టోరీస్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వీర కొగటం దర్శకత్వం వహిస్తున్నారు. సినిమాటోగ్రఫీ బాధ్యతలను మనోజ్ రెడ్డి నిర్వహిస్తుండగా, సంగీతాన్ని జస్టిన్ ప్రభాకరన్ అందిస్తున్నారు. ప్రస్తుతం విడుదలకు సిద్ధమవుతున్న 'రియాలిటీ'తో పాటు కొత్త సినిమా 'రికార్డ్' ప్రకటనతో కిరణ్ అబ్బవరం అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఫస్ట్ లుక్‌లో కనిపిస్తున్న విజువల్స్, టైటిల్ వెనుక ఉన్న అర్థం, సినిమా కథ ఎలా ఉండబోతుందనే విషయాలు తెలియాలంటే మరిన్ని అప్డేట్స్ కోసం ఎదురుచూడాల్సిందే

నాకు క్రష్ లేదు.. నా జీవితమే క్రష్‌అయిపోయింది"..

మీనాక్షి చౌదరి షాకింగ్ కామెంట్స్ వైరల్!



టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న అందాల భామ మీనాక్షి చౌదరి తన సినిమాలతోనే కాకుండా, తన చలాకీ మాటలతోనూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. 'లక్కీ భాస్కర్', 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి సినిమాలతో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం నాగచైతన్య హీరోగా నటిస్తున్న 'వృషకర్మ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మీనాక్షి.. తన క్రష్, ప్రేమ, వ్యక్తిగత జీవితం గురించి చేసిన సరదా వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజా ఇంటర్వ్యూలో యాంకర్ మీనాక్షి చౌదరిని.. ప్రస్తుతం మీకు ఎవరిపైనైనా క్రష్ ఉందా? అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు ఆమె ఏమాత్రం తడుముకోకుండా తనదైన స్టైల్‌లో సమాధానం ఇచ్చారు.నాకు ఎవరిపైనా ఎలాంటి క్రష్ లేదు.. అసలు నా జీవితమే క్రష్ అయిపోయింది" అంటూ నవ్వుతూ సమాధానమిచ్చారు. ఆమె చెప్పిన ఈ ఫన్నీ కామెంట్‌తో అక్కడున్నవారంతా నవ్వుకున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు కూడా ఆమె మాటలకు ఫన్నీ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం వరుస సినిమాలు, షూటింగ్స్, ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్న మీనాక్షి చౌదరి తన వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం కష్టంగా మారిందనే విషయాన్ని తన మాటల ద్వారా వెల్లడించారు. కెరీర్‌పైనే ఎక్కువగా దృష్టి పెట్టినట్లు ఆమె వ్యాఖ్యలను బట్టి తెలుస్తోంది. ప్రేమలో పడటం ఎంత కష్టమో, ప్రేమించిన వ్యక్తితో విడిపోవడం లేదా బ్రేకప్ నుంచి బయటపడటం కూడా అంతే బాధాకరమైన ప్రక్రియ అని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రేమ, రిలేషన్‌షిప్స్ విషయంలో తనకున్న ఆలోచనలను సరదాగా పంచుకోవడంతో ఈ ఇంటర్వ్యూ ఇప్పుడు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. నాగచైతన్య హీరోగా, కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వృషకర్మ' సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. 'విరూపాక్ష' వంటి సక్సెస్‌ఫుల్ సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న కార్తీక్ వర్మ దండు ఈసారి సూపర్ నేచురల్ థ్రిల్లర్ కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ సినిమాలో మైథాలజీ, ట్రెజర్ హంట్, సస్పెన్స్ వంటి అంశాలు ఉండనున్నట్లు ప్రచారం జరుగుతోంది. మీనాక్షి చౌదరి ఇందులో సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన పోస్టర్లలో కళ్లద్దాలు ధరించి, చేతిలో మండుతున్న కాగడాతో కనిపించిన ఆమె లుక్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచింది. ఇక 'వృషకర్మ' సినిమా ప్రమోషన్లను చిత్రబృందం వేగవంతం చేసింది. ఈ సినిమా ట్రైలర్‌ను నవంబర్ 25న నెల్లూరులో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు సమాచారం. డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465